ఉష్ణోగ్రత బుధవారం గరిష్ఠం : 28.0 కనిష్ఠం : 22.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 7

శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు

గురువారం 25 సెప్టెంబరు 2025

రేపు ప్రశాంతి నిలయంలో యజ్ఞం

పుట్టపర్తి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): విశ్వశాంతిని కోరుతూ ప్రశాంతి నిలయంలో శుక్రవారం వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞాన్ని ప్రారంభిస్తున్నారు. ఈ కార్యక్రమం కోసం ప్రశాంతి నిలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పూర్ణచంద్ర హాల్ వేదికగా ఏడు రోజులపాటు ఈ మహాయజ్ఞాన్ని నిర్వహిస్తారు. అక్టోబరు 2వ తేదీ విజయదశమి రోజున పూర్ణాహుతితో యజ్ఞాన్ని ముగిస్తారు. వేదపండితులు ఇప్పటికే ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు.


లేపాక్షిలో అన్నపూర్ణేశ్వరి అలంకరణలో దుర్గాదేవి

అన్నపూర్ణేశ్వరిగా దుర్గాదేవి


పుట్టపర్తిలో అన్నపూర్ణేశ్వరిగా దుర్గాదేవి అమ్మవారు


మామిళ్లకుంట కూడలిలోని లలితాంబ ఆలయంలో అమ్మవారు

లేపాక్షి, పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి వేడుకలలో భాగంగా మూడో రోజు బుధవారం లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణేశ్వరి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రమానందన్ ఆధ్వర్యంలో పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. వారికి అన్నప్రసాదాన్ని అందజేశారు. పుట్టపర్తిలోని ఎనుమలపల్లి దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు, మామిళ్ళకుంట కూడలిలోని లలితాంబ ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణేశ్వరిగా దర్శనమిచ్చారు. ఆలయాలలో ఉదయం అభిషేకం, అర్చనలు, సాయంత్రం లలితా సహస్ర నామ పారాయణం, పల్లకి సేవలు నిర్వహించారు.


జేజేలు కొడుతూ అమరావతికి కదులుతున్న డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు

ఆనందంగా అమరావతికి!

ప్రత్యేక బస్సుల్లో వెళ్లిన ఎంపికైన ఉపాధ్యాయులు

- వారితోపాటు కదిలిన కుటుంబ సభ్యులు
- నేడు సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు

అనంతపురం విద్య, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఎంపికయిన ఉపాధ్యాయులు బుధవారం ఆనందంగా అమరావతికి పయనమయ్యారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. ఆ మేరకు పరీక్షలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేశారు. ఐదు నెలలకే మొత్తం నియామకాల ప్రక్రియను పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో రాజధాని అమరావతిలో మెగా డీఎస్సీ విజయోత్సవ సభను ప్రభుత్వం ఈనెల 25న ఏర్పాటు చేసింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 811 టీచర్ పోస్టులకు గాను 755 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. అలాగే జోనల్-4స్థాయిలో పీజీటీ, టీజీటీ పోస్టులకు జిల్లా స్థాయిలో దాదాపు 100 మందికి పైగా ఎంపికయ్యారు. ఈ అభ్యర్థులందరితో పాటు వారి కుటుంబ సభ్యులలో ఒకరు అమరావతికి బయలుదేరారు. వీరికి జిల్లా విద్యాశాఖ ప్రత్యేకంగా 45 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసింది. ఈ మేరకు బుధవారం ఉదయం పీవీకేకే కళాశాల నుంచి అమరావతికి బయలుదేరి వెళ్లారు. వారివెంట డీఈఓ ప్రసాద్‌బాబుతో (మిగతా 8లో...)

ఆంధ్రజ్యోతికి రుణపడి ఉంటా



నాది ధర్మవరం. డీఎస్సీ ఇంగ్లిష్‌లో 48వర్యాంకు. నియామక ప్రక్రియలో నాకన్నా కింది స్థాయి ర్యాంకు వారిని ఎంపిక చేశారు. ఆ సమయంలో నాకు జరిగిన అన్యాయంపై అర్హత ఉన్నా పోస్టుకు ఎంపిక చేయలేదని ఆంధ్రజ్యోతి పేపర్లో రాశారు. తర్వాత జిల్లా, రాష్ట్ర విద్యాశాఖాధికారులు స్పందించి తప్పును సరిదిద్ది నాకు ఉద్యోగ ఎంపిక జాబితాలో అవకాశం కల్పించారు. నాకు అమ్మానాన్నలేరు. నాకు ఉద్యోగం రావడానికి అవకాశం కల్పించిన ఆంధ్రజ్యోతికి రుణపడి ఉంటా.

-ఆంజనేయులు, ధర్మవరం


రామాంజనేయులును స్కానింగ్‌కు తీసుకెళ్తున్న బంధువులు

● నంద్యాల జిల్లా బేతంచెర్లకు చెందిన రామాంజనేయులు వ్యాన్ డ్రైవర్. పులివెందుల నుంచి చీనీకాయల్ లోడ్‌తో బెంగళూరు వెళ్తుండగా కదిరిలో టిప్పర్ ఢీకొట్టి, తీవ్రంగా గాయపడ్డాడు. కాలువిరిగి, తలకు తీవ్ర గాయాలై అధిక రక్తస్రావంతో స్పృహ కోల్పోయాడు. 108లో అతడిని అనంతపురం సర్వజన వైద్యశాలకు తీసుకొచ్చారు. అతడి బంధువులు పదిమంది వచ్చారురు. ఇక్కడి డాక్టర్లు స్కానింగ్‌లు చేయించాలని రసీదులు రాసిచ్చారు. సిబ్బంది పట్టించుకోకపోవడంతో కుటుంబ సభ్యులే రామాంజనేయులును స్ట్రెచర్‌లో తీసుకెళ్లి స్కానింగ్ చేయించుకువచ్చారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు దాదాపు 1.30 గంటలు పట్టింది.


రామాంజనేయులును స్ట్రెచర్‌పై పెట్టుకుని, వైద్యుల కోసం నిరీక్షిస్తున్న బంధువులు

● చెన్నేకొత్తపల్లికి చెందిన రవికుమార్‌రెడ్డి మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అతడిని 108లో అనంతపురం సర్వజన వైద్యశాలకు తీసుకొచ్చారు. రవికుమార్ రెడ్డి వెంట ఒక మహిళ తోడుగా వచ్చింది. స్కానింగ్‌లు చేయించుకురావాలని డాక్టర్లు చెప్పడంతో ఆమె ఎక్కడికెళ్లాలో, ఎవరిని అడగాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉండిపోయింది.


డాక్టర్ కోసం నిరీక్షిస్తున్నరవికుమార్ రెడ్డి

ఆస్పత్రి కాదు.. అరణ్యం..!

ఆంధ్రజ్యోతి విజిట్

అర్ధరాత్రి సర్వజనాస్పత్రిలో ఆర్తనాదాలు

- అత్యవసర విభాగంలోనూ అందని వైద్యం
- ప్రాణాపాయంలో ఉన్నవారిని పట్టించుకునే వారు కరువు
- వీల్ చైర్లు, స్ట్రెచర్లు కుటుంబీకులు తోసుకోవాల్సిందే..
- కనిపించని సెక్యూరిటీ
- కాన్పుల వార్డులో అన్నీ గర్భిణుల వెంటవచ్చిన వారు చేసుకోవాల్సిందే..
- స్కానింగ్, బ్లడ్‌బ్యాంకు కేంద్రాలకు తలుపులేసుకుని నిద్రలో సిబ్బంది

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అనంతపురం సర్వజనాస్పత్రి ఉమ్మడి జిల్లాకు పెద్దదిక్కు. అలాంటి వైద్యశాలకు ఎంతో మంది నిత్యం ప్రాణాపాయ పరిస్థితిలో వస్తుంటారు. ఆ సమయంలో అత్యవసరంగా సరైన వైద్యం అందితే ఎంతో మంది బతుకుతారు. మెరుగైన వైద్యం అందుతుందన్న నమ్మకంతోనే బాధితులు అర్ధరాత్రి సర్వజనాస్పత్రికి వస్తుంటారు. వైద్యశాలలో మాత్రం పట్టించుకునేవారు కరువవుతున్నారు. కాదు.. కాదు.. కనిపించరు కూడా. మంగళవారం అర్ధరాత్రి 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రాణాపాయ పరిస్థితుల్లో అత్యవసర విభాగానికి తీసుకొచ్చిన వారిని దించుకునే ఎఫ్ఎన్ఓ, ఎంఎన్ఓలు లేరు. క్షతగాత్రుల బంధువులే దింపాల్సిందే. వారే వీల్‌చైర్, స్ట్రెచర్ తెచ్చుకుని, వాటిపై ఉంచుకుని ఎమర్జెన్సీ వార్డులోకి తోసుకెళ్తూ కనిపించారు. అక్కడ వైద్యుడు లేరు. హౌస్ సర్జన్లు మాత్రమే ఉన్నారు. ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్నవారికి ఎలాంటి వైద్యం చేయాలో అర్థంకాక వారు దిక్కులు చూస్తున్నారు. ఏమీ పాలుపోక స్కానింగ్‌లు, రక్త పరీక్షలకు రాసి పంపారు. బాధితుడిని తరలించేందుకు సిబ్బంది లేరు. ఉన్నా.. పట్టించుకోరు. దీతో మళ్లీ కుటుంబ సభ్యులే వీల్‌చైర్‌లో, స్ట్రెచర్‌లో దారిలో కనిపించిన వారిని అడుగుతూ స్కానింగ్ కేంద్రానికి తరలించారు. అక్కడ చేయించారు. తర్వాత రక్త పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ నమూనాలు ఇచ్చాక.. ఫలితాల కోసం గంటల తరబడి వేచిచూశారు. చివరికి ఫలితాలు తీసుకుని, ఎమర్జెన్సీ వార్డుకు వెళ్లారు. అప్పటికే రెండు గంటలు దాటింది. అప్పుడు వైద్యులు (మిగతా 8లో...)

పురంలో దుస్తుల తయారీ శిక్షణ కేంద్రం

- చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి సవిత, ఎమ్మెల్యేలు బాలకృష్ణ, ఎంఎస్ రాజు

హిందూపురం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): చేనేతలకు ఉపాధి కల్పన, ట్రెండ్‌కు అనుగుణంగా దుస్తుల తయారీలో శిక్షణ ఇచ్చేందుకు హిందూపురానికి కేంద్ర ప్రభుత్వం స్మాల్ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం(ఎస్సీడీపీ) మంజూరు చేసిందని చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత తెలిపారు. రాష్ట్ర సచివాలయంలోని తన పేషీలో ఎమ్మెల్యే బాలకృష్ణతో కలిసి ఆమె ఈ వివరాలను బుధవారం వెల్లడించారు. ఈ పథకం ద్వారా 290 మంది చేనేత కార్మికులకు లబ్ధి చేకూరుతుందరని అన్నారు. అనంతరం చేనేత కార్మికులకు శిక్షణ ఇచ్చే ఫ్యాషన్ డిజైనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పురంలో రూ.1.51 కోట్లతో ఏర్పాటు చేస్తున్న ఎస్సీడీపీకి కేంద్ర ప్రభుత్వం తన వాటాగా రూ.1.44 కోట్లు ఇస్తుందని, లబ్ధిదారులు తమ వాటాగా రూ.7.12 లక్షలు వెచ్చిస్తారని తెలిపారు. జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం కింద కేంద్ర ప్రభుత్వం హిందూపురానికి దీనిని మంజూరు చేసిందని తెలిపారు. పట్టుసాగును పెంచేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. పట్టు చీరల తయారీకి అవసరమైన పట్టు మన రాష్ట్రంలో తగినంత ఉత్పత్తి కావడంలేదనీ, దీంతో కర్ణాటక నుంచి కొనుగోలు చేయాల్సి వస్తోందని అన్నారు. కాన్ఫరెన్స్‌లో మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, రాష్ట్ర చేనేత జౌళిశాఖ కమిషనర్ రేఖారాణి, జౌళిశాఖ ముఖ్య కార్యదర్శి ఆర్పీ సిసోడియా, సెరికల్చర్ డైరెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పరిశ్రమల హబ్ ఏర్పాటు చేయండి

మంత్రి కొండపల్లికి ఎమ్మెల్యే బాలకృష్ణ వినతి


మంత్రి కొండపల్లితో సమావేశమైన ఎమ్మెల్యే బాలకృష్ణ

హిందూపురం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): హిందూపురం నియోజకవర్గంలో స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీస్ హబ్ ఏర్పాటు చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాసులును ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కోరారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లిని ఆయన చాంబర్‌లో ఎమ్మెల్యే బుధవారం కలిశారు. తన నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సినంత భూమి ఉందని తెలిపారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి కేవలం 75 కి.మీ. దూరంలో, చిలమత్తూరు వద్ద పరిశ్రమల ఏర్పాటుకు అనువైన భూమి ఉందని తెలిపారు. చిలమత్తూరు మండల పరిధిలో రెండు జాతీయ రహదారులు ఉన్నాయని, రాజధాని అమరావతికి గ్రీన్‌ఫీల్డ్ హైవేని నిర్మిస్తున్నారని తెలిపారు. పరిశ్రమలను అభివృద్ధి చేయడానికి సదుపాయాలు పుష్కలంగా ఉన్నాయని అన్నారు. పరిశ్రమలు ఏర్పాటైతే జిల్లాలో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

మొక్కజొన్న వర్షార్పణం

- కోత కోసిన తరువాత వానలు
- పొలాల్లోనే తడిసిపోయిన దిగుబడి
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు (8లో..)


తడిసిన పంటను ఆరబోసిన రైతు

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 20 తులల బంగారం, రెండు కిలోల వెండి మాయం

(వివరాలు 8లో...)

మొక్కలను నాటి సంరక్షించాలి

బొకేలు, పూలదండలు వద్దు : కలెక్టర్ శ్యాంప్రసాద్


మొక్కలు నాటుతున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

కొత్తచెరువు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు మొక్కలను నాటి.. చెట్లుగా ఎదిగే వరకు బాధ్యతగా సంరక్షించాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని జానకిరామయ్య కాలనీలో ఉపాధి హామీ పథకం కింద మొక్కలు నాటారు. జిల్లా వ్యాప్తంగా కోటి మొక్కలు నాటే కార్యక్రమాకి శ్రీకారం చుట్టారు. కార్యక్రమానికి కలెక్టర్ శ్యాంప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి పత్తిపాటి వెంకటలక్ష్మమ్మ పొలంలో మామిడి మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం కింద ఆరు రకాల పండ్ల మొక్కల పెంపకానికి ప్రభుత్వ అవకాశం ఇచ్చిందన్నారు. రైతులు తమ వ్యవసాయ పొలాల్లో పండ్లమొక్కల పెంపకానికి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ప్రభుత్వమే వాటి సంరక్షణకు డబ్బులు చెల్లిస్తుందన్నారు. తనకు శుభాకాంక్షలు చెప్పేందుకు వచ్చేవారు బొకేలు, పూల దండలు తీసుకురావద్దని తెలిపారు. కార్యక్రమంలో సోషల్ ఫారెస్ట్రీ డీఎఫ్ఓ శ్రీనివాసులు, డ్వామా ఇన్‌చార్జ్ పీడీ శ్రీలక్ష్మీ, ఏపీడీ జ్యోతి, జడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, ఎంపీడీఓ నటరాజ్, ప్లాంటేషన్ మేనేజర్ వెంకప్ప, ఏపీఓ సూర్యనారాయణ పాల్గొన్నారు.

కాలుష్యరహితంగా శత జయంతి

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శతజయంతి వేడుకలను కాలుష్యరహితంగా నిర్వహిద్దామని అధికారులతో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. కలెక్టరేట్‌లో ఎస్పీ సతీష్ కుమార్, జేసీ అభిషేక్ కుమార్‌తో కలిసి శతజయంతి ఏర్పాట్ల గురించి అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు, ఫుడ్ కౌంటర్లు, వైద్య కేంద్రాలు 24 గంటలు పనిచేసేలా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రహదారుల్లో గుంతలు లేకుండా చూడాలని అన్నారు. అక్టోబరు 2 నుంచి ప్లాస్టిక్ నిషేధం అమలులోకి వస్తుందని, సత్యసాయి శతజయంతి వేడుకలను కాలుష్య రహితంగా నిర్వహించేందుకు ప్రజల సహకారం తీసుకోవాలని సూచించారు. వేడుకలకు అన్నిరకాల భద్రతా ఏర్పాట్లు చేస్తామని ఎస్పీ తెలిపారు. సమావేశంలో ట్రస్టు సభ్యులు చలం, డాక్టర్ నారాయణ, ప్రభ, రామేశ్వర్, రాజేష్ పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి: కలెక్టర్

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చేవారిని ప్రోత్సహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహకాలపై కలెక్టరేట్‌లో బుధవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్ఠం చేయాలని, మరింత విస్తృతపరిచేందుకు అన్ని అనుబంధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆర్థిక తోడ్పాటు అందించేలా బ్యాంకర్లలో సమన్వయం చేయాలని సూచించారు. పరిశ్రమల స్థాపనకోసం చేసుకున్న దరఖాస్తులను నిబంధనలకు అనుగుణంగా వెంటనే ఆమోదించాలని సూచించారు. పెట్టుబడి రాయితీ కింద ఏడు పరిశ్రమలకు రూ.1.96 కోట్లు, వడ్డీ రాయితీ కింద రూ.6.50 లక్షలు, విద్యుత్ రాయితీ కింద రూ.5.41 లక్షలను కలెక్టర్ మంజూరు చేశారు. సమీక్షలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, ఫ్యాక్టరీల అధికారి రాధాక్రిష్ణ, విద్యుత్ శాఖ ఎస్ఇ సంపత్ కుమార్, వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

రాష్ట్రపతి విందుకు డిజైనర్ నాగరాజు


రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో అవార్డు గ్రహీతల గ్రూప్ ఫొటోలో నాగరాజు (వృత్తంలో...)

ధర్మవరం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన చేనేత డిజైనర్, జాతీయ అవార్డు గ్రహీత జూజారే నాగరాజు.. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో విందుకు బుధవారం హాజరయ్యారు. ఇటీవల జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నాగరాజు ఢిల్లీలో కేంద్ర మంత్రుల నుంచి జాతీయ అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. జాతీయ అవార్డు ప్రదానం రోజు రాష్ట్రపతి హాజరు కాలేకపోయారు. ఈ నేపథ్యంలో అవార్డులు అందుకున్న వారికి రాష్ట్రపతిని కలిసే అవకాశం కల్పించారని నాగరాజు తెలిపారు. అందులో భాగంగా బుధవారం దేశవ్యాప్తంగా జాతీయ అవార్డులు అందుకున్న 24 మందిని రాష్ట్రపతి భవనలో విందుకు ఆహ్వానించారు. అనంతరం రాష్ట్రపతి భవన్, అమృత గార్డెన్ విశేషాలను గైడ్ వివరించారన్నారు.

సత్యసాయి జయంతి వేడుకలకు రండి

- బాలకృష్ణను ఆహ్వానించిన ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలకు పుట్టపర్తికి రావాలని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను కోరినట్లు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. శాసన సభ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ లాబీలో బాలకృష్ణను కలిసిన ఎమ్మెల్యే నవంబరులో జరిగే సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలకు విచ్చేయాలని ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన బాలకృష్ణ.. బాబా జయంతి ఉత్సవాలకు ప్రభుత్వం ద్వారా అన్ని సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో మంత్రి సవిత, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పాల్గొన్నారు.


నందమూరి బాలకృష్ణతో మంత్రి సవిత, ఎమ్మెల్యేలు పల్లె సింధూరారెడ్డి, సునీత, శ్రావణిశ్రీ

మొక్కజొన్న వర్షార్పణం

● కోత కోసిన తరువాత వర్షాలు ● పొలాల్లోనే తడిసిపోయిన దిగుబడి ● తీవ్రంగా నష్టపోతున్న రైతులు



ట్రాక్టర్‌లోకి వేస్తున్న మొక్కజొన్న పంట



వర్షాలకు తడవకుండా మొక్కజొన్న కంకులపై టార్పాలిన్

విడపనకల్లు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు మొక్కజొన్న రైతుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. బోరుబావుల కింద మే నెలలో సాగు చేసిన పంటను ఇటీవల కోశారు. కంకులను మిషన్‌కు వేసి, ధాన్యాన్ని పొలాల్లోనే ఆరబోశారు. అప్పటి నుంచి వర్షాలు కొనసాగుతున్నాయి. వాటిని ఆరబెట్టే వీలు లేకపోగా, వర్షపు నీటికి తడిసి ముద్దయ్యాయి. ఇలాగే వదిలేస్తే మొత్తం దిగుబడి పోతుందని ఆందోళన చెంది.. పొలాల్లోంచి రోడ్డు మీదకు ట్రాక్టర్‌లలో తరలిస్తున్నారు. పూర్తి స్థాయిలో ఎండలు కాస్తే విత్తనం కొంతవరకూ రంగు మారకుండా ఉంటుంది. లేదంటే రంగు మారి, తగిన ధర లభించదని రైతులు ఆందోళన చెందుతున్నారు. చీకలగురికి బొజ్జప్ప 5 ఎకరాల్లో మొక్క జొన్న సాగు చేశాడు. కోత కోశాక వర్షాలు రావడంతో మొత్తం తడిసిపోయింది. మొక్క జొన్న సొప్ప కూడా మిగల్లేదు. అంతా పొలంలోనే వదిలేశాడు. ఎకరానికి 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని, అంతా వర్షపునీటిలో తడిసిపోయిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. రామక్రిష్ణ అనే రైతు రెండు ఎకరాల్లో పంట సాగు చేశారు. కోత కోసి, కంకులను పొలంలోనే కుప్పగా పోశారు. సుమారు 60 క్వింటాళ్ల దిగుబడి సాధించారు. ఇది కూడా వర్షానికి తడిసిపోయింది. ఉరవకొండ నియోజవర్గంలో మొక్కజొన్న సాగు చేసిన రైతులందరి పరిస్థితి ఇలాగే ఉంది. వేల ఎకరాల్లో పంటలను కోత కోసి, పొలాల్లోనే కుప్పలుగా వేశారు.

ఎండ కాయకపోతే నష్టమే..



నేను 5 ఎకరాల్లో మొక్క జొన్న సాగు చేశాను. మే నెలలో పంట పెడితే ఈ నెలలో కోతకు వచ్చింది. కుటుంబ సభ్యులు అందరం కలిసి పొలంలో కష్టపడ్డాము. మంచి దిగుబడి వచ్చింది. కానీ కోత కోశాక వర్షాలు రావటంతో దిగుబడి మొత్తం తడిసిపోయింది. విత్తనాలు గుగ్గిళ్లలా మారాయి. పొలంలోని విత్తనాలను రోడ్డుపైకి తెచ్చేందుకు కూలీలకు రూ.9 వేలు, ట్రాక్టర్ బాడుగ రూ.6 వేలు ఖర్చు అయింది. నాలుగు రోజులపాటు ఎండలు బాగా కాస్తే విత్తనం రంగు మారకుండా ఉంటుంది. లేదంటే రూ.3 లక్షలకు పైగా నష్టం వస్తుంది. - బొజ్జప్ప, చీకలగురికి



తడిసిన మొక్కజొన్న విత్తనాలను తిరిగేస్తున్న రైతు

మొత్తం తడిసిపోయింది..

నేను రెండు ఎకరాల్లో మొక్క జొన్న సాగు చేశాను. కోత కోశాక వర్షాలు రావడంతో పంట మొత్తం తడిసిపోయింది. టార్పాలీన్ కప్పినా కింది నుంచి నీరు వెళుతోంది. రోజుల తరబడి కప్పి ఉంచితే కంకులు నల్లగామారిపోతాయి. ఏమి చేయాలో తెలియడం లేదు. సుమారు 60 క్వింటాళ్ల దిగుబడి ఉంటుంది. రూ.1.50 లక్షలు నష్టపోయాను. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

- రామక్రిష్ణ, బూదగవి

పార్లమెంటులో చట్టం చేయించండి

వాల్మీకి, బోయల అంశంపై ప్రభుత్వ విప్ కాలవ

అనంతపురం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్పించేందుకు పార్లమెంటులో చట్టం చేయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు కోరారు. అసెంబ్లీలో బుధవారం ఆయన మాట్లాడారు. సామాజిక హోదాలో మార్పు కోసం వాల్మీకి, బోయలు ఎప్పటి నుంచో ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. వాల్మీకి, బోయలు షెడ్యూల్డ్ తెగలకు చెందిన వారని 1961లో సెన్సస్ కమిషన్ ఆఫ్ ఇండియా డిప్యూటీ రిజిస్ట్రార్ జనరల్ రాయి బర్మన్ ప్రకటించారని గుర్తు చేశారు. ఏపీ ట్రైబల్ కమిషన్‌తో పాటు 2017లో సత్యపాల్ కమిటీ సైతం వాల్మీకి, బోయలను ఎస్టీల్లో చేర్చాలని సిఫార్సు చేసిందని అన్నారు. బోయలను ఎస్టీల్లో చేర్చాలని ఎన్టీఆర్ తొలిసారి ఆలోచించారని అన్నారు. ఆయన ఆలోచనలను కార్యరూపంలో పెట్టడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా ప్రయత్నించారని అన్నారు. 2017 డిసెంబరు రెండో తేదీన శాసన సభలో ఈ అంశాన్ని ప్రతిపాదించారని, శాసన సభ తీర్మానం చేయించి, కేంద్రానికి సిఫార్సు చేశారని అన్నారు. ఈ ప్రతిపాదనలో ఆరు అంశాలపై కేంద్రం వివరణ కోరిందని, వైసీపీ ప్రభుత్వం సరైన వివరణ ఇవ్వకపోగా, ఏకసభ్య కమిషన్ పేరుతో కాలయాపన చేసిందని విమర్శించారు. రాయలసీమలో ఉన్న వాల్మీకి బోయలను మాత్రమే ఎస్టీల్లో చేర్చాలని కేంద్రానికి నివేదిక పంపిందని అన్నారు. రాష్ట్రంలోని పాతిక లక్షల మంది వాల్మీకి, బోయలు చంద్రబాబును తమ దేవుడుగా భావిస్తారని, ఆయన ద్వారానే తమకు న్యాయం జరుగుతుందనే విశ్వాసంతో ఉన్నారని అన్నారు. అక్టోబరు 7న వాల్మీకి జయంతి ఉందని, ఆ రోజు ఎలా గడపాలో అర్థంకాని సందిగ్దత వాల్మీకి బోయల్లో నెలకొందని అన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో పాటు ఇతర ప్రభుత్వ పెద్దలకు నచ్చజెప్పి పార్లమెంటులో చట్టం చేసేలా చూడాలని ముఖ్యమంత్రిని కోరారు. బీజేపీ, జనసేన నేతలు కేంద్రం వద్ద పలుకుబడిని ఉపయోగించి, చట్టం చేసేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్ల నిర్మాణానికి నిధులివ్వండి: ఎమ్మెల్యే పరిటాల సునీత



అనంతపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో బుధవారం ఆమె మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చాక రోడ్లకు నిధులు ఇస్తున్నారని, తమ నియోజకవర్గంలో ఇప్పటికే చాలా చోట్ల రోడ్ల సమస్యలు పరిష్కారమయ్యాయని కృతజ్ఞతలు తెలిపారు. మరికొన్ని రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉందని అన్నారు. అనంతపురం నగర శివారులోని టమోటా మండీల నుంచి కనగానపల్లి మీదుగా చిగురు చెట్టు వరకూ, తగరకుంట నుంచి ఎగువపల్లి, తగరకుంట నుంచి నూతిమడుగు, చిగిచెర్ల వరకూ ప్రధాన రహదారులను నిర్మించాల్సి ఉందని తెలిపారు. రోడ్లు దెబ్బతిన్న కారణంగా ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. యాలేరు, తగరకుంట గ్రామాల మధ్యలో రోడ్డు పనులు ప్రారంభమయ్యాయని, ఇంకా 15 కి.మీ. పనులు నిధులు లేక ఆపాల్సి వస్తోందని వివరించారు. రహదారుల పనులకు రూ.150 కోట్లు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

భారత్ ఫైబర్ పరుగులు..!

తక్కువ ధరలతో ల్యాండ్‌లైన్ కాల్స్, టీవీ చానల్స్, ఓటీటీలు

ఫైబర్ నెట్ డీలర్ల సమన్వయంతో సేవలు

ప్రభుత్వ ఉద్యోగులకు 10 శాతం డిస్కౌంట్

అమల్లోకి హైస్పీడ్ ఇంటర్నెట్ ప్లాన్‌లు



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ తమ కస్టమర్లకు భారత్ ఫైబర్ ద్వారా ఇంటర్‌నెట్ సేవలు అందించేందుకు ప్రత్యేక ప్లాన్‌లను అమలులోకి తెచ్చింది. ప్రస్తుతం ఇంట్లో టీవీలకు ఇంటర్‌నెట్ సౌకర్యం పెరిగింది. అందుకనుగుణంగా ప్రైవేట్ కంపెనీలు రకరకాల ఖరీదైన మోడమ్‌లతో ఇంటర్‌నెట్ సేవలతో పాటు టీవీ చానల్స్, ఓటీటీ యాప్స్‌ను తీసుకొచ్చాయి. వాటి ధరలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో బీఎస్ఎన్ఎల్ ప్రైవేట్ టెలికాం సర్వీసుల కన్నా తక్కువ ధరలకే ఇంటర్‌నెట్, టీవీ చానల్స్, ఓటీటీ సేవలను అందిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగులకు అన్ని ప్లాన్లపై 10 శాతం డిస్కౌంట్‌ను అమలు చేస్తోంది. ఇప్పటికే వేల సంఖ్యలో కస్టమర్లు ఈ సేవలను వినియోగిస్తున్నట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

రూ.400కే 444 చానల్స్, 9 ఓటీటీలు..

బీఎస్ఎన్ఎల్ ప్రవేశపెట్టిన భారత్ ఫైబర్ ద్వారా అనేక రకమైన సేవలను అందిస్తోంది. రూ.400 రీచార్జ్‌పై ల్యాండ్‌ఫోన్‌కు అన్‌లిమిటెడ్ లోకల్, ఎస్టీడీ కాల్స్, రూ.500 సెక్యూరిటీ డిపాజిట్, 20 ఎంబీపీఎస్ స్పీడుతో 500 జీబీ వరకూ నెట్, ఆ తరువాత 2 ఎంబీపీఎస్ స్పీడుతో నెట్ సౌకర్యాన్ని కల్పించింది. ఈ ప్లాన్ ద్వారా దాదాపు 444 పైగా టీవీ చానళ్లను అందిస్తోంది. వీటిలో ప్రధానంగా జెమినీ సిరీస్, ఈటీవీ హెచ్‌డీ సిరీస్, జీ సిరీస్, స్టార్ మా హెచ్‌డీ, నిక్ జూనియర్ తదితర చానళ్లను అందిస్తోంది. వీటితో పాటు 9 రకాల ఓటీటీలకు అవకాశం కల్పించింది. అందులో స్మార్ట్‌ప్లే టీవీ, ఓటీటీ ప్లే, డిస్ట్రో టీవీ, ఈటీవీ విన్, సన్ ఎన్‌ఎక్స్‌టీ, ఫ్యాన్‌కోడ్, ఓం టీవీ, రెడ్ హాట్, ఫ్రైడే ఓటీటీ చానళ్లు ఉంటాయి. ఈ ప్లాన్‌లో చేరాలంటే రూ.260 ఎఫ్‌టీటీహెచ్ రీచార్జ్‌తో పాటు రూ.140 టీవీ చానళ్లకు కలిపి మొత్తం రూ.400 రీచార్జ్ చేయాల్సి ఉంటుంది.

హైస్పీడ్ ఇంటర్నెట్ ప్లాన్‌లు..

బీఎస్ఎన్ఎల్ హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలను ఓ మోస్తారు ధరలతో తీసుకొచ్చింది. అందులో రూ. 399 నుంచి అమలు కానున్నాయి. వీటిలో ప్రధానంగా రూ. 449 రీచార్జ్ చేసుకుంటే... 50 ఎంబీపీఎస్ స్పీడు ఇంటర్‌నెట్ సేవలు 6 నెలల వాలిడిటీతో వర్తిస్తాయి. ఇందులో అన్‌లిమిటెడ్ కాల్స్ ఓటీటీ యాప్స్ ఉంటాయి. రూ.799 రీచార్జ్‌పై 125 ఎంబీపీఎస్ స్పీడ్‌తో 4000 జీబీ డేటా సేవలు, రూ. 599 రీచార్జ్‌పై 75 ఎంబీపీఎస్ స్పీడ్‌తో 4000 జీబీ డేటా, రూ.1299 రీచార్జ్‌తో 225 ఎంబీపీఎస్ స్పీడుతో 6000 జీబీ డేటా వర్తిస్తుంది. వీటితో పాటు మరో రెండు ప్లాన్ త్వరలో అమల్లోకి రానున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఫైబర్ నెట్ డీలర్లతో సమన్వయం

బీఎస్ఎన్ఎల్ ప్రవేశపెట్టిన భారత్ ఫైబర్ ఇంటర్‌నెట్ సేవలను కస్టమర్లకు అందించేందుకు ఫైబర్ నెట్ డీలర్లతో సమన్వయం చేసుకుంటోంది. నెట్ సేవలు అందిస్తున్న టెలికాం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడర్స్‌తో ఈ సేవలను కస్టమర్ల ఇంటివద్దకే వెళ్లి కనెక్షన్‌లు ఇచ్చేలా చర్యలు తీసుకుంటోంది. ఇంట్లో ల్యాండ్‌లైన్ ఫోన్ ఉన్న కస్టమర్లకు ఫోన్ ద్వారా కేబుల్ కనెక్షన్‌తో నెట్ సేవలు అందిస్తోంది. వాయిస్ కాల్స్ వద్దనుకున్న కస్టమర్లకు మోడమ్ సాయంతో ఇంటర్‌నెట్‌తో పాటు టీవీ చానల్స్, ఓటీటీ చానళ్ల సదుపాయం కల్పించింది.

హైస్పీడుతో భారత్ ఫైబర్ కనెక్షన్లు



భారత్ ఫైబర్ పేరుతో కస్టమర్లకు బీఎస్ఎన్ఎల్ పలు రకాల సేవలను అందిస్తోంది. రూ. 400 ప్లాన్‌తో ప్రారంభమై అత్యధిక స్పీడుతో అందించే పలు రకాల ప్లాన్లను అమలు చేస్తోంది. బీఎస్ఎన్ఎల్ కస్టమర్లు ఎక్కడున్నా హైస్పీడు ఇంటర్‌నెట్‌తో పాటు టీవీ చానళ్లు, ఓటీటీలను అందించేందుకు చర్యలు తీసుకుంది. భవిష్యత్తులో కస్టమర్లను ఆకర్షించే ప్లాన్లు మరిన్ని అమలు కానున్నాయి.

-ముజీబ్ పాషా, జనరల్ మేనేజర్, బీఎస్ఎన్ఎల్

ఆనందంగా అమరావతికి!



సూచనలిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు, పీవీకేకే విద్యాసంస్థల డైరెక్టర్ పల్లె కృష్ణకిషోర్ రెడ్డి

(7వ పేజీ తరువాయి)

పాటు ప్రతిబస్సుకు ఒక ఎంఈఓ లేదా హెచ్‌ఎం, ఒక పీడీ, ఒక కానిస్టేబుల్ పర్యవేక్షణకు వెళ్లారు. మొత్తం మీద రెండు వేలమందికి పైగా అనంత నుంచి అమరావతి బాటపట్టారు.



అమరావతికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న బస్సులు

● ఎంతో సంతోషంగా ఉంది



డీఎస్సీలో పీడీగా ఎంపికయ్యాను. నోటిఫికేషన్ ఇచ్చి వెంటనే పరీక్షలు నిర్వహించి, నియామకాలు చేపట్టడం ఆనందంగా ఉంది. అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో నియామకాల పత్రాలు అందించడం మరింత సంతోషం కలిగిస్తోంది.

-స్రవంతి. నార్సింపల్లి, కనగానపల్లి మండలం

● నా కొడుకుతోపాటు వెళుతున్నా



మాది గొరిదిండ్లతండా. నా కొడుక్కి టీచర్ ఉద్యోగం వచ్చింది. విజయవాడకు రమ్మన్నారంటే పోతున్నాం. నాకు ముగ్గురు కొడుకులు, ఒక కూతురు. ఇపుడు రవికుమార్‌నాయక్ అనే కొడుక్కి ఉద్యోగం వచ్చింది. మిగిలిన వాళ్లందరికీ పెళ్లిళ్ల చేశా. ఇపుడు రవికి ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. ఈయప్పకు ఇక పెళ్లిచేయాలి.

-హనుమంతునాయక్, గొరిదిండ్లతండా, ఆత్మకూరు మండలం

● ఇంత త్వరగా ఇవ్వడం మా అదృష్టం



నేను ఫిజికల్ సైన్స్ టీచర్‌గా ఎంపికయ్యాను. 2018లో పోటీపడినా పోస్టు రాలేదు. అప్పటి నుంచి ఓ వైపు భర్త, పిల్లలను చూసుకుంటూనే కష్టపడి చదువుకుంటూ వచ్చాను. డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చినా నియామకాలకు రెండేళ్ల పట్టేది. ఇపుడు డీఎస్సీ ఇవ్వడం, ఇందులో ఉద్యోగం పొందడం, ఇంత త్వరగా నియామకాలు ఇవ్వడం మా అదృష్టంగా బావిస్తున్నా.

-హరిణి, షేక్షానుపల్లి, ఉరవకొండ మండలం

● మా ఇంట్లో మూడు భాషల టీచర్లు



మా నాన్న ఇంగ్లీష్ టీచర్.. మా అమ్మ తెలుగు టీచర్.. ఇపుడు నేను హిందీ టీచర్‌గా ఎంపికయ్యాను. మా ఇంట్లో మూడు బాషల టీచర్లు ఉండడం ఎంతో సంతోషంగా ఉంది. డీఎస్సీ అంటేనే టీడీపీ ప్రభుత్వం, చంద్రబాబునాయుడు గుర్తుకొస్తారు. డీఎస్సీ ఇచ్చి వెంటనే నియామకాలు చేపట్టడం మేము చేసుకున్న పుణ్యమే.

-కౌశిక్ శాస్త్రి, అనంతపురం

● నాలుగేళ్ల కష్టానికి ప్రతిఫలం



మాది పేద కుటుంబం. మా అమ్మానాన్న కుటుంబ పోషణ కోసం ఎంతో కష్టపడుతుంటారు. అందుకే ఉద్యోగం కొట్టాలని నాలుగేళ్లుగా ఊరు వెళ్లకుండా అనంతపురంలోనే ఉంటూ సాయిగంగ కోచింగ్‌సెంటర్‌లో ప్రిపేర్ అవుతూ వచ్చాను. ఆ దేవుడిలా చంద్రబాబు సీఎం కావడం, డీఎస్సీ ఇవ్వడం, ఇక్కడ టీచర్ ఉద్యోగం రావడం మరవలేనిది. నాలుగేళ్ల కష్టానికి కూటమి సర్కారు ద్వారా ప్రతిఫలం దక్కింది.

- జీవన, బొమ్మక్కపల్లి, రాయదుర్గం మండలం

ఆంజనేయులు సరే.. నా సంగతేంటి..?

టీజీటీకి అర్హత ఉంది.. న్యాయం చేయండి

డీఈఓ వద్ద బాధిత అభ్యర్థి వరలక్ష్మి ఆవేదన

అనంతపురంవిద్య, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇంగ్లిష్ బీసీ-ఏ కేటగిరీలో ఆంజనేయులుకు తొలుత అన్యాయం చేసారు.ముందుసారి జాబితాలో ఉన్న తనను ఇపుడు తొలగించారు, సవరించి ఆంజనేయులుకు న్యాయం చేసారనీ, అది ఓకే, అయితే తనకు ఇతర టీజీటీ పోస్టులో అర్హత ఉంది, ఎందుకున్యాయం చేయలేదని డీఎస్సీ అభ్యర్థి వరలక్ష్మి కన్నీటిపర్యంతమయ్యారు. వరలక్ష్మి తొలి ఎంపిక జాబితాలో ఇంగ్లిష్‌లో బీసీ-ఏ కేటగిరీలో అవకాశం కల్పించారు. అదే సబ్జెక్టులో ధర్మవరానికి చెందిన ఆంజనేయులు 76.28 మార్కులతో 48వ ర్యాంకులో ఉన్నారు. ఆయనకు అవకాశం ఇవ్వకుండా 49వ ర్యాంకు అభ్యర్థిని జనరల్ కేటగిరీలో ఎంపిక చేశారు. ఆ తర్వాత స్థానంలో కూడా ఆంజనేయులుకు అవకాశం ఇవ్వకుండా కింది ర్యాంకుల వారిని ఎంపిక చేశారు. దీనిపై ఆంజనేయులు.. డీఈఓని సంప్రదించడంతో ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఆంజనేయులకు ఎంపిక జాబితాలో చోటు కల్పించారు. బీసీ-ఏ కేటగిరిలో ముందు జాబితాలో ఇంగ్లిష్‌లో చివరగా ఎంపికైన వరలక్ష్మి పేరును తొలగించారు. అమరావతికి రావద్దని డీఈఓ కార్యాలయం నుంచి ఫోన్ చేసి, చెప్పారు.



డీఈఓను కలిసిన బాధిత అభ్యర్థి వరలక్ష్మి

ఆనందం నుంచి ఆవేదనలోకి..

తనకు ఉద్యోగం వచ్చిందని ఆనందంలో ఉన్న వరలక్ష్మి డీఈఓ కార్యాలయం ఫోన్‌తో ఆవేదనలోకి వెళ్లిపోయింది. బుధవారం పీవీకేకే కళాశాలకు కుటుంబసభ్యులతో వచ్చి డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి, ఆంజనేయులకు న్యాయం చేయడానికి తన పేరు తొలగించారనీ, టీజీటీ ఇంగ్లిష్‌లో 250వ ర్యాంకుఉందనీ న్యాయం చేయాలని కోరారు. తనకన్నా తక్కువ ర్యాంకు ఉన్నవారిని ఎంపిక చేశారనీ, తనకు అన్యాయం చేశారని వాపోయారు. న్యాయం చేయాలని వేడుకున్నారు. ఇందుకు డీఈఓ స్పందిస్తూ.. వివరాలను డీఈఓ కార్యాలయంలో ఇవ్వాలని సూచించగా.. అక్కడకు వెళ్లి అందించారు. ఇక్కడ పరిశీలించి, విషయాన్ని ఆర్జేడీ శామ్యూల్ దృష్టికి తీసుకెళ్లారు.

ఆస్పత్రి కాదు.. అరణ్యం..!

(7వ పేజీ తరువాయి)

పరీక్షించి, తాపీగా వార్డుకు తరలించారు. ఈ సమయంలో ప్రాణం పోతే ఎవరిది బాధ్యత? ప్రాణాపాయ పరిస్థితుల్లో వచ్చిన వారికి వెంటనే వైద్యం అందించి, వారి ప్రాణాలను కాపాడాలన్న కనీస బాధ్యతను డాక్టర్లు విస్మరిస్తుండడం శోచనీయం.

అన్నీ కుటుంబ సభ్యులే చూసుకోవాలి..

కాన్పుల వార్డులో ఇబ్బందులు వేరేలా ఉన్నాయి. పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భవతులు కూడా ఇక్కడ తిప్పలు పడాల్సిందే. రక్త పరీక్షలను కుటుంబ సభ్యులే చేయించుకు రావాల్సిందే. రక్త నామూనాలు సేకరించేందుకు ల్యాబ్‌కెళ్లి గాజు ట్యూబులను వారే తెచ్చుకోవాలి. తిరిగి వాటిని ఇచ్చి రావాలి కూడా. సులువుగా కాన్పులు జరగడానికి, బీపీ కంట్రోల్ ఉంచడానికి, ఇతర సమస్యలకు అవసరమైన మందులను బయటికెళ్లి కొనుక్కొచ్చుకోవాల్సిందే.

తలుపులేసుకుని నిద్రలోకి..

అత్యవసర పరిస్థితుల్లో రక్తం ఎక్కించాలంటే క్రాస్‌మ్యాచింగ్ చేయాలి. బ్లడ్‌బ్యాంకు, స్కానింగ్ కేంద్రాలకు వెళ్తే అక్కడి సిబ్బంది తలుపులు వేసుకుని నిద్రలోకి జారుకుంటున్నారు. గట్టిగా అరిచినా వారు నిద్రమత్తులో నుంచి బయటకు రావడంలేదు. ఎంఎన్ఓ, ఎఫ్ఎన్ఓలు, సెక్యూరిటీ సిబ్బంది వంతులవారీగా పనిచేస్తున్నారు. ఒక్కోసారి మూకుమ్మడిగా విశ్రాంతి తీసుకుంటున్నారు.

చికిత్స చేయట్లేదు: శీను, బేతంచెర్ల, నంద్యాల జిల్లా



రామాంజనేయులు ప్రాణాపాయ పరిస్థితుల్లో ఆస్పత్రికి తీసుకొస్తే వైద్యులు పట్టించుకోవట్లేదు. వెంటనే వైద్యం చేయట్లేదు. స్కానింగ్‌లు రాసిస్తే మేమే స్ట్రెచర్‌లో తోసుకెళ్లి, చేయించుకుని వచ్చాం. ట్రీట్‌మెంట్ చేయమంటే నిర్లక్ష్యంగా ఉన్నారు. ప్రాణాలు పోతున్నా.. పట్టించుకోకుంటే ఎలా?

సూదిమందు లేదంట: షబానా, తాడిపత్రి



మా చెల్లెలు షకిలాను కాన్పునకు తీసుకొచ్చాం. డాక్టర్లు పరీక్షించి, మాత్రలు ఇచ్చారు. బీపీ ఎక్కువగా ఉందనీ, ఇంజక్షన్ వేయాలన్నారు. ఆస్పత్రిలో సూదిమందులేదనీ, బయటికెళ్లి తీసుకురావాలని రాసిచ్చారు. మా ఇంట్లోవాళ్లకి చీటీ ఇచ్చి పంపా. అర్ధరాత్రి ఎక్కడ దొరుకుతుందో.. ఏమో?

ఎక్కడిస్తారో తెలియదు: వెంకటమ్మ, కుటాగుళ్ల, కదిరి



నా కూతురు లావణ్యను ప్రసవానికి తీసుకొచ్చా. డాక్టర్లు సిజేరియన్ చేయాలన్నారు. రక్త పరీక్షలు చేయాలనీ, గాజు ట్యూబ్‌లు తెచ్చుకోవాలని చీటీ రాసిచ్చారు. ఎక్కడిస్తారో తెలియక అంతా తిరిగాను. మళ్లీ వార్డుకెళ్లి డాక్టర్లను అడిగితే పైన 19వ నంబరు అనిచెప్పారు. అప్పుడు వెళ్లి.. తెచ్చుకున్నా.



కాన్పులవార్డు వద్ద బాధిత కుటుంబ సభ్యుల నిరీక్షణ

తాళం వేసిన ఇంట్లో చోరీ



20 తులల బంగారం, రెండు కిలోల వెండి మాయం

బుక్కపట్నం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో భారీ చోరీ జరిగింది. తాళాలను పగులగొట్టి ఓ ఇంట్లోకి చొరబడిన దొంగలు, 20 తులాల బంగారం, రెండు కేజీల వెండి, రూ.10 వేల నగదును ఎత్తుకువెళ్లారు. బుక్కపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా, మెయిన్‌రోడ్డు పక్కనే ఈ చోరీ జరగడం కలకలం రేపుతోంది. బాధితురాలు సవితమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మన్న తెలిపారు. సవితమ్మ హైదరాబాద్‌లో ఉన్న కుమారుడు సిద్దు వద్దకు 15 రోజుల క్రితం వెళ్లారు. తన కూతురు, కోడలికి చెందిన బంగారం ఆభరణాలను ఇంట్లోనే ఉంచారు. ఇంటికి తాళం వేయడాన్ని పసిగట్టిన దొంగలు, మంగళవారం రాత్రి చొరబడ్డారు. దొంగతనం జరిగినట్లు బుధవారం ఉదయం గమనించిన స్థానికులు సవితమ్మకు సమాచారం ఇచ్చారు. ఆమె వచ్చి పరిశీలించి, ఇంట్లో ఉన్న బంగారం, వెండి, నగదు చోరీ అయినట్లు గుర్తించారు. ఇన్‌చార్జి ఎస్ఐ లింగన్న ఆధ్వర్యంలో క్లూస్ టీం ఆధారాలను సేకరించింది. డాగ్ స్క్వాడ్ చేత తనిఖీ చేయించారు.



బీరువాలోని వస్తువులను చిందవందర చేసిన దృశ్యం, చోరీ జరిగిన ఇంట్లో డాగ్ స్క్వాడ్



నృసింహావతారంలో దర్శనమిస్తున్న శ్రీవారు

నృసింహావతారంలో శ్రీవారు



స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలో ఉన్న భక్తులు

కదిరి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీవారు బుధవారం నృసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నిత్య కైంకర్యాలు, అలంకరణ అనంతరం నృసింహావతారంలో ఉన్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారు నృసింహావతారంలో భక్తులను కనువిందు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, అర్చకులు, భక్తులు, ఉభయదారులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగులకు 78 రోజుల బోనస్

గుంతకల్లు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగులకు 78 రోజుల జీతాన్ని బోనస్‌గా చెల్లించడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. ప్రతి సంవత్సరం రైల్వే ఉద్యోగులకు దసరాకు ముందు బోనస్‌ను ప్రకటించి, చెల్లిస్తోంది. ఈ మేరకు బుధవారం ఉదయం కేంద్ర మంత్రివర్గం సమావేశమై ఉత్పాదకత ఆధారిత బోనస్ కింద రైల్వే ఉద్యోగులు, కార్మికులకు 78 రోజుల వేతనం గరిష్టంగా రూ.17,951 బోనస్‌ను ప్రకటించింది. త్వరలో ఆ మొత్తాలను రైల్వే శాఖ పంపిణీ చేయనుంది.

రెండోరోజూ కొనసాగిన పీజీ అడ్మిషన్లు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పీజీ అడ్మిషన్ల ప్రక్రియ రెండోరోజు బుధవారం కొనసాగింది. తొలిరోజు 17 మంది అడ్మిషన్ పొందారు. రెండోరోజు 66 మంది అడ్మిషన్లు పొందినట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్స్ ప్రొఫెసర్ నరసింహన్ తెలిపారు. గురువారం కూడా అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని అన్నారు.

862.23 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాకు కోరమాండల్ కంపెనీకి చెందిన 862.23 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ వద్ద వ్యాగిన్లలో వచ్చిన యూరియా బస్తాలను పరిశీలించామని తెలిపారు. జేసీ ఆదేశాల మేరకు... ఏపీ మార్క్‌ఫెడ్, రైతు సేవా కేంద్రాలకు 336, మన గ్రోమోర్, ప్రైవేటు డీలర్లకు 526.23 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశామని వెల్లడించారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

డ్వామా పీడీ సలీంబాషా

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనులకు వచ్చే ఉపాధి కూలీల సంఖ్యను మరింతగా పెంచాలని డ్వామా పీడీ సలీం బాషా ఆదేశించారు. తన కార్యాలయం నుంచి క్లస్టర్ ఏపీడీలు, ఏపీఓలు, ఏసీలు, టీఏలతో ఆయన బుధవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాకాలం ముగిసేలోపు మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపిక చేసిన గ్రామాల్లో ఇళ్లవద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయించాలని సూచించారు. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన 31 గ్రామ పంచాయతీల్లో యుక్తధార్ అమలును పకడ్బందీగా చేయాలని సూచించారు.

టమోటా కిలో రూ.24

అనంతపురం రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో బుధవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.24తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠ ధర రూ.14, సరాసరి ధర రూ.18 విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2,850 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

ఇబ్బడి ముబ్బడిగా లే అవుట్లు

818 అక్రమ లే అవుట్ల గుర్తింపు

375 మాత్రమే క్రమబద్ధీకరణ

ఎల్ఆర్ఎస్ చేసుకోకపోతే బ్లాక్‌లిస్ట్‌లోకి..

వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతోనే ఈ దుస్థితి



అనధికార లేఅవుట్‌లో రాళ్లను తొలగిస్తున్న అహుడా అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇబ్బడి ముబ్బడిగా లేఅవుట్లు వేశారు. వీటిలో సింహభాగం వైసీపీ నాయకులు, సానుభూతి పరులవే ఉన్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ అనుమతి లేకుండా వేసిన 818 లేఅవుట్లను అహుడా అధికారులు గుర్తించారు. 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వ హయాంలో అనంతపురం హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అహుడా) పరిధిలో 818కి పైగా లేఅవుట్లలో 8వేల ఎకరాల్లో విస్తరించినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఇచ్చిన లేఅవుట్ రీఅసెస్‌మెంట్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్)తో అనధికార లేఅవుట్లు వెలుగులోకి వస్తున్నాయి. వీటిలో 80 శాతానికి పైగా వైసీపీ నేతలకు చెందినవే ఉండడం గమనార్హం. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే విజిలెన్స్ అధికారులు అనధికార లేఅవుట్లపై నివేదిక ఇచ్చినా పట్టించుకోలేదు. వీటిని క్రమబద్ధీకరించేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎల్ఆర్ఎస్‌తో ఉమ్మడి జిల్లాలోని 818 అనధికార లేఅవుట్లలో సుమారు 40వేల మందికి లబ్ధిచేకూరనుంది. ఇప్పటి వరకు 375 లేఅవుట్లను ఎల్ఆర్ఎస్ పరిధిలోకి తీసుకువచ్చారు. అక్టోబరు 24వతేదీ లోపు ఎల్ఆర్ఎస్ చేయించుకోని అక్రమ లేఅవుట్లను బ్లాక్‌లిస్టులో పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఎల్ఆర్ఎస్ చేయించుకోకపోతే బ్లాక్‌లిస్టులోకి..

అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలో ఎల్ఆర్ఎస్ చేసుకోని లేఅవుట్లను బ్లాక్‌లిస్టులో పెట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 818 అక్రమ లేఅవుట్లను గుర్తించిన అహుడా అధికారులు ఎల్ఆర్ఎస్ చేసేపనిలో నిమగ్నమయ్యారు. ఎల్ఆర్ఎస్ చేసుకోని లేఅవుట్లను బ్లాక్‌లిస్టులో పెట్టడంతో విద్యుత్, మంచి నీరు, రోడ్లు లాంటి మౌలిక వసతులు కల్పించబోమని అహుడా అధికారులు హెచ్చరిస్తున్నారు. మరీ ముఖ్యంగా అక్రమ లేఅవుట్లలో భవననిర్మాణాలకు అనుమతిచ్చేది లేదని చెబుతున్నారు. అనుమతులు తీసుకోకుండా వేసిన లేఅవుట్లతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. కొందరు అధికారులు వైసీపీ నేతలతో కుమ్మక్కై యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లకు సహకరించారనే ఆరోపణలు ఉన్నాయి.

ఎల్ఆర్ఎస్ చేయించుకోవాలి..



అహుడా పరిధిలోని అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాల్సిందే. లేదంటే బ్లాక్‌లిస్టులో పెట్టేస్తాం. అహుడా పరిధిలో ఇప్పటి వరకు 818 అనధికార లేఅవుట్లను గుర్తించాం. వీటిలో 375 లేఅవుట్లను ఎల్ఆర్ఎస్ చేయించుకున్నారు. మిగిలినవి కూడా అక్టోబరు 24వతేదీలోపు క్రమబద్ధీకరించుకోవాలి. అనధికార లేఅవుట్ల వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లుతోంది. భవన అనుమతులు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రభుత్వం దృష్టి సారించింది. అనధికార లేఅవుట్లను ఎల్ఆర్ఎస్ చేసుకోవడానికి ఇదే చివరి అవకాశం. అనధికార లే అవుట్లలో భవన నిర్మాణాలకు అనుమతులు పొందే అవకాశం ఉండదు.

- టీసీ వరుణ్, చైర్మన్, అహుడా

జడ్పీ కాంప్లెక్స్ టెండర్‌లో రింగ్..!

నిబంధనల ఉల్లంఘన

ఒకరి పేరుతోనే పలు గదులకు టెండర్లు



టెండర్ ప్రక్రియను పరిశీలిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ శివశంకర్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణంలోని గదులను దక్కించుకోవడంలో టెండర్‌దారులు రింగ్‌అయినట్లు తెలుస్తోంది. వారికి యంత్రాంగం సహకారం అందించినట్లు స్పష్టమవుతోంది. జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణంలోని డీపీఆర్‌సీ సమావేశ భవనం వెనుక వైపు సాయినగర్ రోడ్డుకు ఉన్న జడ్పీ షాపింగ్ కాంప్లెక్స్‌లోని 12 గదులను అద్దెకు ఇవ్వడానికి టెండర్ నిర్వహించారు. అందులో భాగంగా బుధవారం సాయంత్రం జడ్పీ కార్యాలయంలోని చైర్‌పర్సన్ గిరిజమ్మ చాంబర్‌లో సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో టెండర్లను ఓపెన్ చేశారు. జాబితాను పరిశీలించిన సీఈఓ.. పలు గదులకు సంబంధించి ఒకే పేరు మీద టెండర్ నమోదు కావడంతో కంగుతిన్నారు. పార్కింగ్ లేదన్న నెపం చూపి నగర నడిబొడ్డున ఉన్న గదులకు రూ.4,500 అద్దె నిర్ణయించినట్లు తెలిసింది. రూ.4,600 నుంచి రూ.5000 లోపే టెండర్లు నమోదు చేసి గదులను దక్కించుకున్నారన్న ప్రచారం జరుగుతోంది. అధికారులు ప్రారంభంలో ఒక్కొక్క గదికి రూ.8,500గా నిర్ణయించాలనుకున్నప్పటికి చివరికి రూ.4,500కే నిర్ణయించినట్లు తెలిసింది. దీనికి తోడు పలు గదులకు ఒకే పేరు మీద టెండర్ నమోదు చేయడాన్ని పరిశీలిస్తే.. ప్రభుత్వం నిర్ణయించిన దానికన్నా స్వల్ప ఆధిక్యంతో టెండర్ దక్కించుకునే ప్రయత్నం చేశారన్న ప్రచారం జరుగుతోంది. డిమాండ్ ఉన్న ప్రాంతం. ఇంతకంటే ఎక్కువ నమోదు చేసేవారు ఉన్నారు. సరైన సమాచారం ఇవ్వకుండా అధికారులు ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేలా చేశారన్న ప్రచారం జరుగుతోంది. జాబితాను బయటకు పొక్కకుండా గోప్యంగా ఉంచారు. దీంతో పలు అనుమానాలకు దారి తీస్తోంది. దీనిపై పాలకులు, కలెక్టర్ విచారణ చేసి తగిన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రేషన్ డీలర్లకు ఈ-పోస్ మిషన్ల పంపిణీ



డీలర్‌కు ఈ-పోస్ మిషన్ అందజేస్తున్న జేసీ

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రేషన్ డీలర్లకు పాత ఈ-పోస్ మిషన్ల స్థానంలో అధునాతన యంత్రాలను పంపిణీ చేశారు. నగరంలోని కృష్ణకళామందిరంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ బుధవారం వాటిని ఆత్మకూరు, కూడేరు, గార్లదిన్నె మండలాలకు చెందిన డీలర్లకు అందజేశారు. జేసీ మాట్లాడుతూ.. నూతన యంత్రాలతో రేషన్ పంపిణీలో పారదర్శకత వస్తుందన్నారు. జిల్లాలోని 1645 దుకాణాల డీలర్లకు కొత్త మిషన్లు 27వ తేదీలోగా అందజేసి, శిక్షణ ఇవ్వాలని విజన్ టెక్ ఇంజనీర్లకు ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇరిగేషన్ డైరెక్టర్‌గా లోకేశ్ ప్రమాణ స్వీకారం





బాల లోకేశ్‌ను అభినందిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

అనంతపురం క్రైం, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా జిల్లాకు చెందిన బాల లోకేశ్ బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమానికి కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు, హిందూపురం ఎంపీ బీకే పార్థసారధి హాజరై, అభినందించారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం నుంచీ బాలలోకేశ్ ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు.

గోవా మద్యం స్వాధీనం

5,460 బాటిళ్లు పట్టివేత.. నలుగురి అరెస్ట్

వెంబడించి పట్టుకున్న అధికారులు



లిక్కర్, నిందితులను చూపుతున్న అధికారులు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న గోవా మద్యాన్ని జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఇన్నోవా కారులో తరలిస్తుండగా అధికారుల అడ్డుకున్నారు. నిందితులు ఇన్నోవా వాహనంతో తప్పించుకునే ప్రయత్నం చేయగా.. అధికారుల బృందం వెంబడించి పట్టుకుంది. వారి నుంచి 116 బాక్సుల్లో 5,460 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలను వెల్లడించారు. ఉదయం జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్ ఆధ్వర్యంలో ఇతర సీఐలు వడ్డుపల్లి టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేస్తున్నారు. ఒక ఇన్నోవా కారు, ఒక మారుతీ స్విఫ్ట్ డిజైర్ కారులో గోవా అక్రమ మద్యం ఉన్నట్టు గుర్తించారు. వారిని ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం పట్టుకోగా.. ఇన్నోవా వాహన డ్రైవర్, మరో వ్యక్తి అధికారులపై ఎదురుతిరిగి తప్పించుకుని పారిపోయేందుకు యత్నించారు. తగరకుంట, బాలసంద్రం వైపు వెళ్లగా వెంబడించి పట్టుకున్నారు. ఇద్దరు వ్యక్తులు, ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్నారు. రెండు వాహనాల్లోని 116 పెట్టెల్లో ఉన్న అక్రమ గోవా మద్యం 5,460 బాటిళ్ల 1003.32 లీటర్ల మద్యం పట్టుకున్నారు. రెండు వాకీటాకీ సెట్లు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని నలుగురు నిందితులు వీరేంద్ర, ప్రవీణ్, వెంకటేష్, పవన్ కుమార్‌ను అరెస్టు చేశారు. కార్యక్రమంలో సీఐలు అన్నపూర్ణ, అలీ బేగ్, జయనాథ్‌రెడ్డి, సత్యనారాయణ, ఎస్ఐలు నరేష్‌బాబు, హరికృష్ణ, సత్యనారాయణ, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం సీజనల్ చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరిధర రూ.14వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 414టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

కర్నూలు ఇన్‌చార్జి డీఐజీగా విజయలక్ష్మి

కర్నూలు డీఆర్‌గా భార్గవ్‌కు ఎఫ్ఏసీ

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా డీఐజీగా పనిచేస్తున్న విజయలక్ష్మికి కర్నూలు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కర్నూలు డీఐజీ పీజీఎస్ కల్యాణి రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి రిలీవ్ అవడంతో విజయలక్ష్మికి కర్నూలు డీఐజీగా పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ) అప్పగిస్తూ ఆ శాఖ ఐజీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కల్యాణి కర్నూలు జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా కొనసాగేవారు. ఈ నేపథ్యంలో జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్‌కు కర్నూలు జిల్లా రిజిస్ట్రార్‌గా అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగించారు.

అక్టోబరు 31న కుంభాభిషేకం

ముహూర్తాన్ని నిర్ణయించిన చినజీయర్ స్వామి

గుంతకల్లు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయ గోపురాల కలశస్థాపన, కుంభాభిషేకానికి చినజీయర్ స్వామి ముహూర్తాన్ని నిర్ణయించారు. స్వామివారి పేరును అనుసరించి అక్టోబరు 31న ఈ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. బంగారు కలశాలను తయారు చేయించి, ఉత్తరాయన పుణ్యకాలంలో కుంభాభిషేకాన్ని నిర్వహించాలని ఆలయ అధికారులు మొదట భావించారు. కానీ ఆలయంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలంటే తొలుత గోపురాలకు కలశ స్థాపన, కుంభాభిషేకాలను నిర్వహించాలని త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామి సూచించారు. దీనికి సమయం తక్కువగా ఉండటంతో బంగారు కలశాల స్థానంలో పంచలోహ కలశాల తయారీకి ఆర్డర్ ఇచ్చారు. అక్టోబరు 29వ తేదీ నుంచి మూడు రోజులపాటు కలశ స్థాపన, కుంభాభిషేక ఉత్సవాలను నిర్వహిస్తామని ఈఓ విజయరాజు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణం నుంచి ఆలయం వరకూ భక్తులు, దాతలతో భారీ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు.

టమోటా కొనుగోలు చేస్తాం

జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్ర కుమార్

అనంతపురం రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో టమోటా కొనుగోలు చేస్తామని ఆ శాఖ ఏడీ రాఘవేంద్ర కుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అధికారులు టమోటా కొనుగోలు ప్రక్రియను ప్రారంభించాలని సూచించారని తెలిపారు. ఈ మేరకు బుధవారం రాప్తాడు మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో టమోటా కొనుగోలు చేపట్టామని తెలిపారు. కిలో రూ.20తో కొనుగోలు చేశామని పేర్కొన్నారు. వాటిని వైజాగ్‌లోని రైతుబజారుకు తరలించామని అన్నారు. ప్రస్తుతం అక్కడ ధరలు ఎక్కువగా ఉండటంతో ఇక్కడి నుంచి కొనుగోలు తరిస్తున్నామని తెలిపారు. దీని వలన ఇక్కడి రైతులకు లాభం చేకూరడంతోపాటు..ఎగుమతి ప్రాంతాల్లోని ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు.

లారీల్లో డీజిల్ చోరీ

600 లీటర్లు అపహరించిన దొంగలు

యాడికి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పార్కింగ్ చేసిన రెండు లారీల్లో నుంచి 600 లీటర్ల డీజిల్ చోరీ చేసిన సంఘటన మంగళవారం రాత్రి మండలంలోని పెద్దపేట గ్రామంలో చోటుచేసుకుంది. పెద్దపేట గ్రామానికి చెందిన లారీ యజమానులు వేణు, నాగేంద్ర తెలిపిన మేరకు.. మంగళవారం రాత్రి గ్రామంలోని ఆంజనేయస్వామి గుడి ఎదురుగా ఉన్న ఖాళీస్థలంలో లారీలను పార్కింగ్ చేశారు. ఉదయం లారీల వద్దకు వచ్చి లారీల్లో ఉన్న 600 లీటర్ల డీజిల్‌ను దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించామని తెలిపారు. చోరీ జరిగిన డీజిల్ విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం



గంగాధర్ నాయుడు (ఫైల్)

నంబులపూలకుంట, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం సమీపాన కదిరి-రాయచోటి రోడ్డులో అన్నమయ్య జిల్లా సరిహద్దు ప్రాంతంలో బుధవారం ద్విచక్రవాహనాన్ని బొలెరో ఢీకొనడంతో రైతు గంగాధర్ నాయుడు అలియాస్ బుచ్చప్ప (35) దుర్మరణం చెందారు. అతడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పల్లెనివారిపల్లికి చెందిన గంగాధర్ నాయుడు వ్యవసాయం చేసుకుంటుండేవాడు. బుధవారం పని నిమిత్తం అన్నమయ్య జిల్లాలోని వెలిగల్లుకు ద్విచక్రవాహనంలో వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో మండెంవారిపల్లి రోడ్డులో వెళ్తుండగా, వెనుకవైపు నుంచి వేగంగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గంగాధర్‌నాయుడు అక్కడికక్కడే మృతిచెందాడు. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గంగాధర్‌నాయుడు తండ్రి వీరమల్లప్పనాయుడు పెద్దకర్మ ఆదివారం నిర్వహించారు. మూడు రోజులకే కుమారుడు మరణించడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోలీసులు కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మహిళ ఆత్మహత్య

కూడేరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జల్లిపల్లి గ్రామానికి చెందిన రాకెట్ల లక్ష్మి(25) కడుపునొప్పి తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. ఈనెల 22న లక్ష్మి భర్త లింగమయ్య పని నిమిత్తం తోటకు వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో లక్ష్మికి కడుపునొప్పి అధికమైంది. బాధ భరించలేక పురుగుల మందు తాగి, అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన బంధువులు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మంగళవారం రాత్రి మృతిచెందారు.

యువతి అదృశ్యం

కూడేరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గార్లదిన్నెకు చెందిన శిరీష అనే యువతి కూడేరులో అదృశ్యమయ్యారు. గార్లదిన్నె నుంచి నెల రోజుల క్రితం ఆమె కూడేరులోని బంధువుల ఇంటికి వచ్చారు. మంగళవారం అదృశ్యం కావడంతో ఆమె తల్లి సుజాత పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సచివాలయ ఉద్యోగుల ఆందోళన

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సీనియారిటీ జాబితా ప్రకటించి, ఉద్యోగోన్నతి కల్పించాలని డిమాండ్ చేస్తూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు ఆందోళనకు దిగారు. నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి మెరుపు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, బదిలీలకు ముందే సీనియారిటీ జాబితా ప్రకటిస్తామన్న ప్రభుత్వం.. ఏడాదిన్నరగా కాలయాపన చేస్తోందని అన్నారు. వెంటనే సీనియారిటీ జాబితాను విడుదల చేసి, ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. రెండేళ్లు 9 నెలల ప్రొబేషన్ పీరియడ్‌కు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇంటింటా సర్వే సేవలను సచివాలయ ఉద్యోగులకు పూర్తిగా రద్దు చేయాలని, నిర్దిష్ట జాబ్‌చార్ట్ ప్రకారం విధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జాయినింగ్ తేదీ ఆధారంగా బదిలీలు చేసిన తరహాలోనే ఉద్యోగోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో జేఏసీ నాయకులు సుధాకర్, లక్ష్మీనారాయణ, హనుమంతు, మల్లికార్జున, చంద్ర రామకృష్ణ, కిశోర్, శిరీష, మాధవి, సునీత, గిరి, ప్రసాద్, ప్రదీప్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

సర్వేల ఒత్తిడి తగ్గించాలి

● ఎంపీడీఓకు రైతు సేవాకేంద్రం సిబ్బంది వినతి

నంబులపూలకుంట, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సర్వేల వత్తిడిని తగ్గించాలని రైతు సేవాకేంద్రం సిబ్బంది బుధవారం తహసీల్దార్ దేవేంద్రనాయక్, ఎంపీడీఓ పార్థసారథికి వినతిపత్రం అందించారు. వారు ఆయా కార్యాలయాల్లో తహసీల్దార్, ఎంపీడీఓను కలిశారు. ఇప్పటికే రైతులకు రైతుసేవా కేంద్రాల నుంచి ఎరువులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అలాగే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, భూసార పరీక్షలు, పంట కోత ప్రయోగాలు, పొలం పిలుస్తోంది, ఈకేవైసీ, రైతులకు అందించే డ్రిప్, స్ప్రింకర్లతోపాటు యూరియా అందించే పనిలో సిబ్బంది బిజీగా ఉన్నారన్నారు. ఇప్పుడు బీడు భూములను కూడా సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఆ సర్వే చేయాలంటే ఈ పనులు వెనుకబడతాయన్నారు.

తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభం



పనులను పరిశీలిస్తున్న బీజేపీ నాయకుడు హరీశ్‌బాబు

ధర్మవరం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేశవ నగర్‌లో 15వ ఆర్థిక సంఘం నిధుల కింద రూ.14లక్షలతో వ్యయంతో జరుగుతున్న తాగునీటి పైపులైన్ పనులను బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు బుధవారం పర్యవేక్షించారు. ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా నిరాటంకంగా ఉండేలా రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కట్టుబడి ఉన్నారన్నారు. పనుల పురోగతిపై ఆయన సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌తో ప్రత్యేకంగా సమావేశమై సూచనలు ఇచ్చారు. పనులను నాణ్యతాప్రమాణాలను పాటిస్తూ సకాలంలో పూర్తిచేయాలని కోరారు.

పైపులైన్‌కు మరమ్మతులు చేయండి

● తిరుమలదేవరపల్లి వాసుల డిమాండ్



పైపులైన్ పగిలిపోవడంతో రోడ్డుపై పారుతున్న నీరు

కొత్తచెరువు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని తిరుమలదేవరపల్లిలో తాగునీటి పైపులైన్ పగిలిపోయి నీరు వృధాగా రోడ్డుపై పారుతోంది. దాదాపు 20 రోజుల క్రితం ఈ పైపులైన్ పగిలిపోయిందని గ్రామస్థులు తెలిపారు. దీంతో నీరు ట్యాంకుకు వెళ్లడంలేదని, తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నాని వాపోయారు. నీరంతా రోడ్డుపై నిలబడుతూ మడుగును తలపిస్తోందని అంటున్నారు. దీంతో దోమలు అధికమై గ్రామంలో విషజ్వరాలు ప్రబలుతున్నాయని తెలిపారు. తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేయాలని పంచాయతీ కార్యదర్శికి, సర్పంచ్‌కు తెలిపినా వారు పట్టించుకోలేద న్నారు. ఇప్పటికైనా ఉన్నతాదికారులు స్పందించి గ్రామంలో పగిలిపోయిన తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

'ఆర్‌ఎస్ఎస్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం'

తాడిమర్రి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపుకుందామని ఆర్ఎస్ఎస్ జిల్లా సహకార్య వహ శరత్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం బీజేపీ నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్‌బాబు వారితో మాట్లాడుతూ.. విజయదశమి పండు గ రోజు ఘనవేష్ ఆర్ఎస్ఎస్ యూనిఫాం ధరించి ఉత్సవాలలో పాల్గొనాలన్నారు. మం డల ప్రజలందరు పాల్గొనేవిదంగా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ రాము, నాయకులు అనుగుర్తి రమణ, గంగాధర్,ఆనంద్, వన్నూర్‌రెడ్డి, చంద్ర, కొంకా నాగార్జున పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి: సీపీఐ

కదిరి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి సమీపంలో టి. రెడ్డివారిపల్లికి చెందిన పరంబోకు స్థలాన్ని కాపాడా లని సీపీఐ నాయకులు ఆర్ఐ శ్రీనివాసులుకు బుధవారం వినతిప త్రం అందించారు. వారు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాల యంలో ఆర్ఐని కలిశారు. టి. రెడ్డివారిపల్లి వద్ద సర్వేనంబర్ 1173-3లో ఎకరా 67సెంట్లు ఉన్న పరంబోకు స్థలం ఉందన్నారు. ప్రస్తుతం అది ఆక్రమణకు గురైందని, అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఐ నాయకులు ఈశ్వరయ్య, సిద్దయ్య ఖాదర్‌బాషా, అశోక్, హరి తదితరులు పాల్గొన్నారు.

సేవాస్ఫూర్తిని పెంపొందించుకోవాలి



ప్రభుత్వ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు

ధర్మవరం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి సేవాస్ఫూర్తిని పెంపొందించుకోవాలని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌ప్రశాంతి పేర్కొన్నారు. జా తీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) సంస్థాపన దినోత్సవాన్ని ఆ కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలో విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో చెత్తను, ప్లాస్టిక్‌ను తొలగించారు. మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపాల్ హర్షవర్ధన్, ఎన్ఎస్ఎస్‌పీఓ శ్రీనివాసులు, కళాశాల ఇన్‌చార్జ్ రమేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.



వివేకానంద కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు





ధర్మవరంలో అన్నపూర్ణేశ్వరిగా గాంధీనగర్ చౌడేశ్వరీదేవి, వాసవీమాత



బాలాత్రిపుర సుందరిగా కొత్తపేట వెంకటేశ్వరస్వామి

మాతా అన్నపూర్ణేశ్వరీ..!

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు మూడోరోజు బుధవారం భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ధర్మవరంలోని దుర్గమ్మ ఆలయంలో అన్నపూర్ణేశ్వరి ఆలంకరణలో దుర్గమ్మ, కొత్తపేట వెంకటేశ్వరస్వామి బాలాత్రిపురసుందరిగా, గాంధీనగర్ చౌడేశ్వరీదేవి, దుర్గమ్మ, వాసవీమాత అన్నపూర్ణేశ్వరిగా, సంతాన లక్ష్మీదేవిగా సాలేవీధి పెద్దమ్మ, వరహావతార అలంకరణలో శ్రీనివాసనగర్‌లో వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే ధర్మవరంలోని గోరకాటి పెద్దమ్మ, మండలంలోని ఉప్పునేసినపల్లిలో కొల్లాపురమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కొత్తచెరువులోని పెద్దమ్మ అన్నపూర్ణేశ్వరి దేవిగా, బత్తలపల్లిలో కొలువుదీర్చిన అమ్మవారు ప్రత్యేక అలంకరణలో, కదిరి పట్టణంలో గౌరీదేవిగా చౌడేశ్వరీ, రాజరాజేశ్వరిగా కదిరికొండ చౌడేశ్వరి, మధురమీనాక్షి అలంకరణలో వాసవీమాత దర్శనమిచ్చారు. అమడగూరులో అన్నపూర్ణదేవిగా చౌడేశ్వరిని అలంకరించారు.



ధర్మవరంలో అన్నపూర్ణేశ్వరి అలంకరణలో దుర్గమ్మ



రాజరాజేశ్వరిగా కదిరికొండ చౌడేశ్వరీదేవి



కదిరిలో మధుర మీనాక్షిగా వాసవీమాత



కొత్తచెరువులో అన్నపూర్ణేశ్వరిగా పెద్దమ్మ

కుటుంబానికి వెన్నెముక మహిళ: కలెక్టర్



వృద్ధులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

కొత్తచెరువు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మహిళ కుటుంబానికి వెన్నెముక లాంటిదని కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. మహిళలు ఆరో గ్యంగా ఉంటేనే ఆ కుటుంబం, సమాజం సంతోషంగా ఉంటుందన్నారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం డీఎంహెచ్ఓ ఫైరోజ్‌బేగం, డీసీహెచ్ఎస్ మధుసూదన్ ఆధ్వర్యంలో డాక్టర్ అశ్వత్థకుమార్ నిర్వ హించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసగించారు. జిల్లావ్యాప్తంగా నెలలో రెండు లేక మూడు వైద్యశిబిరాలను నిర్వహించాలని డీఎంహెచ్ఓకు, వైద్యులకు సూచించారు. ఈ వైద్యశిబిరాలకు వచ్చే రోగులకు ముందస్తుగానే పరీక్షలు నిర్వహించి ఆ జబ్బులపై వారికి అవగాహన కల్పిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయాలన్నారు. మహిళలు ఆరోగ్యం ఉండాలన్న సదుద్దేశ్యంతో ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్‌కు శ్రీకారం చుట్టిందని తెలిపారు. అనం తరం శిబిరానికి వచ్చిన వృద్ధులతో మాట్లాడుతూ ఆసుపత్రిలో వైద్య సేవల గురించి వివరాలను అడిగితెలుసుకున్నారు. రక్తదాన శిబిరాన్ని పరిశీలించి, యువత పెద్దసంఖ్యలో ముందుకు వచ్చి రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ల జాయ్‌వెస్లీ, భార్గవ్, వరలక్ష్మి, హారిక, జయశ్రీ, ఎంపీడీఓ నటరాజ్, మాజీ ఎంపీపీ వాణి, టీడీపీ పట్టణ కన్వీనర్ వలిపి శీన తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలుగా మార్చాలి: డీడీఓ

బత్తలపల్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో పేద కుటుంబాలను గుర్తించి బంగారు కుటుంబాలుగా మార్చేందుకు కృషి చేయాలని డీడీఓ జనార్దనరావు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పి-4 సర్వేపై శిక్షణ తరగతులు నిర్వహిం చారు. డీడీఓ హాజరై మాట్లాడుతూ... పీ4 సర్వేలో ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమములో ఎంపీడీఓ నరసింహనాయుడు, ఏఎస్ఓ శర్మ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు 'బంగారు కుటుంబంపై మార్గదర్శకాలు, సర్వే అవగాహన కల్పించారు. ఈసందర్భంగా శిక్షకులు హరినాథ్, రాఘవేంద్ర, బంగారు కుటుంబ మార్గదర్శకాల యాప్‌లో భద్రపరిచాల్సిన వివరాలపై వివరించారు. ఈనెల 30లోగా యాప్ ద్వారా సర్వే పూర్తి చేయాలని ఎంపీడీఓ శివరామప్రసాద్‌రెడ్డి ఆదేశించారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ రమణనాయక్, సీఎస్‌డీటీ విజయనిర్మల, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని శక్తివంతమైన కుటుంబానికి తోడ్పడాలని వైద్యులు కమల్ రోహిత్ పేర్కొన్నారు. మండలంలోని మద్దకవారిపల్లిలో బుధవారం స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్‌ను నిర్వహించారు. టీడీపీ మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, చాకివేలు శ్రీనివాసులు, ప్రసాద్, రంగనాథ్, క్రిష్టప్ప, నాగరాజుతోపాటు ఆరోగ్య సిబ్బంది ప్రమీల, బిందుమార్గవి, అఖిల, గోపాల్‌నాయక్, మాధవీలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వినయకుమారి తదితరులు పాల్గొన్నారు.



మద్దకవారిపల్లిలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం

అయ్యప్ప ఆలయంలో చోరీ

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కొత్తపల్లి బండపై వెలసిన అయ్యప్ప ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగినట్లు ఆలయ సంకల్పకులు పచ్చర్ల ఆంజనేయులు నాయుడు బుధవారం తెలిపారు. రోజులాగానే బుధవారం తెల్లవారుజామున ఆలయానికి వెళ్లగా, అప్పటికే తాళం పగలకొట్టి ఆలయంలో ఉన్న 50కిలోల బియ్యం బస్తాలు రెండు, హారతి పళ్లెంలో భక్తులు వేసిన రూ. 2,100 నగదు దోచుకెళ్లినట్లు తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో
పద్మావతి డిగ్రీ కళాశాల విద్యార్థినుల ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ధర్మవరం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ రెండు రోజుల క్రితం ప్రకటించిన 2, 4 సెమిస్టర్ ఫలితాలలో స్థానిక పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున తెలిపారు. ద్వితీయ సంవత్సరం బీకాం గ్రూపులో హాజీరాబాను (96.6 శాతం), చంద్రిక (95), ఆమ్రిన్(94), బీబీఏలో అమృతవర్షిణి(91), షబానా(89), అపర్ణ (88)శాతం సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరం బీఎస్సీలో శ్రీలక్ష్మీ ప్రసన్న(78) శాతం, జీవిత(75), ప్రత్యూష(75)శాతం సాధించినట్లు తెలిపారు. అలాగే తృతీయ సంవత్సరం బీబీఏలో యాస్మిన్(94)శాతం, హిమబిందు((89, కళ్యాణి(87), బీకాం గ్రూపులో ధరణి(80), ఆర్పియా(79), వైష్ణవి(78)శాతం సాధించి సత్తాచాటారన్నారు. సత్తాచాటిన విద్యార్థులను ప్రినిపాల్, అధ్యాపకులు బుధవారం అభినందించారు.

టమోటా వర్షార్పణం

● ఇటీవల కురిసిన వర్షపు నీటిలో కొట్టుకుపోయిన పంట

తనకల్లు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మార్పురివాండ్లపల్లిలో ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ భాగంలో ఉన్న వంకలు, వాగులు, కుంటలు, పొంగి పోర్లాయి. దీంతో ఎగువ కుంటవద్ద రైతు రవి ఎకరం పొలంలో సాగుచేసిన టమోటా పంట మొత్తం నీటిలో కొట్టుకు పోయింది. దీంతో రూ.లక్ష నష్టం జరిగినట్లు బాధిత రైతు రవి తెలిపారు. ఆరుగాలం కష్టపడి పంట సాగుచేశానని, పంట బాగా ఉండడంతో జత కట్టెలు కట్టడానికి రూ.3 ఒప్పందంతో 2,200 కట్టెలు నాట్టించానని తెలిపారు. ఒకేరోజు రాత్రి వర్షం ఎక్కువగా కురవడంతో వంకలు, వాగులు దాటి పొలాల్లోకి నీరుపారిందన్నారు. ఉదయం పొలం వద్దకు వెళ్లి చూస్తే సాగుచేసిన టమోటా మొత్తం నీటిలో కొట్టుకుపోయిందని ఆవేదన చెందా రు. కేవలం అక్కడక్కడ కొన్ని కట్టెలు మిగిలాయన్నారు. పూత దశలో ఉన్న పంట ఆనవాళ్లు లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం, అధికారులు పరిశీలించి జరిగిన నష్టాన్ని అంచనావేసి, ఆదుకోవాలని రైతు రవి కోరారు.



వర్షానికి ముందు రోజు ఉన్న పంట



వర్షానికి కొట్టుకుపోయిన తరువాత..

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



చిగిచెర్లలో పంపిణీ చేస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ ఓబిరెడ్డి

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారు లకు పంపిణీ చేశారు. చిగిచెర్లలో మాజీ జడ్పీచైర్మన్ ఓబిరెడ్డి, డీలర్ పార్థారెడ్డి, ఉప్పునేసినపల్లిలో సర్పంచ్ ముత్యాలప్ప నాయుడు అధికారులతో కలిసి పంపిణీ చేశారు. ఏలుకుంట్లలో టీడీపీ నాయకులు రామ్మోహన్, డీలర్ మలసాని భాస్కర్, ఓబుళనా యునిపల్లిలో డీలర్ గడ్డం రాయుడు, మల్లేనిపల్లిలో టీడీపీ నాయకులు చంద్ర, డీలర్ రామ్మోహన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● ముదిగుబ్బ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని రేషన్ షాప్ నంబర్ 26లో బుధవారం టీడీపీ మండల కన్వీనర్ కరణం ప్రభాకర్ సచివాలయ సిబ్బందితో కలిసి స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధి దారులకు పంపిణీ చేశారు. బీజేపీ మండల నాయకుడు మా లపాటి రామకృష్ణ, టీడీపీ నాయకులు మనుబోలు ప్రసాద్, భాస్కర్, రాశిపల్లి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు



రోడ్డుకు మరమ్మతులు చేసిన దృశ్యం

తనకల్లు, సెప్టెంబరు 24 (ఆంధ్ర జ్యోతి): 'వర్షానికి కొట్టుకుపోయిన రోడ్డు' అన్న వార్త ఆంధ్రజ్యోతి దినపత్రిలో సోమవారం ప్రచురితమైన విషయం విదితమే. ఈ వార్తకు స్పందించిన పంచా యతీ రాజ్ అధికా రులు బుధవారం అధిక వర్షానికి కొట్టుకు పోయిన కుర్మాలపల్లి, చిన్న ఎద్దులవారిపల్లి రోడ్డుకు మరమ్మతులు చేయించారు. మట్టి తోలి, తెగిపోయిన రోడ్డును బాగు చేయించారు. దీంతో గ్రామస్థులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రజ్యోతికి స్పందన

రోగులకు తప్పిన అవస్థలు

●ధర్మవరంరూరల్: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి ప్రవేశద్వారం ముందుభా గంలో ఇనుపపైపుల వద్ద ఉన్న గుంతను వైద్యాధికారులు ఇసుకతో పూడ్పించి రోగు లకు ఇబ్బందులు లేకుండా చేశారు. ఆ గుంత ఏర్పడడంతో రోగు లు ఆసుపత్రిలోకి వెళ్లేందుకు రోగులు ఇబ్బందులు పడుతుండేవా రు. కాలుజారిపడే ప్రమాదం ఉండేది. ఈ విషయంపై ఆంధ్రజ్యోతిలో ఈనెల 15న 'ఆదమరిస్తే అంతే' అనే కథనాన్ని ప్రచురితమైంది. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ తిప్పేంద్రనాయక్ స్పందించారు. జిల్లా వైద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఇనుపపైపుల వద్ద ఇసుకతోలించి గుంతను పూడ్చించి, ఆ ప్రాంతంలో చదును చేయించారు. దీంతో ఆంధ్రజ్యోతికి పలువురు ధన్యవాదాలు తెలిపారు.

అకుకూరలు అద్భుత ఔషధాలు : సీడీపీఓ



ఆకుకూరల అవశ్యకతను వివరిస్తున్న సీడీపీఓ జయంతి

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలకు అకుకూరలు అద్భుత పోషకవిలువలతో కూడిన ఆహారమని సీడీపీఓ జయంతి పేర్కొన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని ఎనుములపల్లి-2 అంగన్‌వాడీ కేంద్రంలో పోషణపక్వాడా- బేటీ బచావో- బేటీ పఢావో కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ జయంతి పాల్గొని మాట్లాడుతూ... స్థానికంగా ప్రకృతిసిద్ధంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు,ధాన్యాలు, చిరుధాన్యాలు తీసుకోవాలన్నారు.ఈ సమతుల ఆహారం శరీరానికి అవసరమైన పోషకాలు అందిస్తుందని ఆమె పేర్కొన్నారు. బాలిక జన్మించిన ఇంటిలో మొక్కనాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

షూటింగ్‌బాల్ పోటీల్లో ధర్మవరం విద్యార్థుల సత్తా



ఎంపికైన విద్యార్థులతో హెడ్ సిస్టర్

ధర్మవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తమ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యా ర్థులు రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు స్థానిక జీవనజ్యోతి పాఠశాల హెడ్ సిస్టర్ సు జాత తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గతనెల 9వ తేదీన జిల్లా స్థాయి షూటింగ్‌బాల్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అందులో తమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న చరణ్, ఎనిమిదో తరగతి చదువుతున్న విక్కీ, వరుణ్ ప్రతిభ కనబరచినట్లు తెలిపారు. వారు గురు, శుక్రవారాల్లో కర్నూల్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్‌పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆ విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు బుధవారం అబినందించారు.

బోరులో పొంగి వస్తున్న నీరు

తనకల్లు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని నడిమికుంటపల్లి పంచాయతీ నక్కరాళ్ల తండా వద్ద రైతు శంకర్‌నాయక్ బోరులో నీరు పొంగి పొర్లుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంతంలో ఉన్న చెక్ డ్యామ్‌లు, కుంటలు, వంకలు, వాగులు, పూర్తి గా నీటితో నిండిపోయాయి. దీంతో చెక్‌డ్యామ్ దిగువనున్న శంకర్‌నాయక్ పొలంలోని బోరులో మోటారు ఆన్ చేయకనే నీరు పొంగి వస్తోంది. ఈ దృశ్యాన్ని పలువురు గ్రామస్థులు తిలకించారు.



పోలీసు శాఖపై ప్రజల్లో నమ్మకం పెంచాలి

ఎస్పీ సతీష్‌కుమార్



పెనుకొండ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆపదలో వచ్చే వారికి పోలీస్‌శాఖపై నమ్మకం పెంచేవిధంగా సేవలందించాలని ఎస్పీ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం పెనుకొండ పోలీస్‌స్టేషన్‌ను, సీఐ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ క్రమంలో రిసెప్షన్ కౌంటరు, రికార్డులు, వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్రవాహనాల కేసుల వివరాలపై ఆరాతీశారు. ఈ క్రమంలో సీఐ రాఘవన్‌తో మాట్లాడుతూ చట్టవ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలకు ఉపేక్షించవద్దని వారిపై గట్టిగా నిఘా పెట్టాలని ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిస్సింగ్ కేసు, మహిళలు, చిన్నపిల్లలపై జరిగే నేరాలపై ఆరాతీశారు. రాత్రివేళల్లో డ్రంక్ అండ్ డ్రైవ్, చోరీలు, జరగకుండా ముమ్మరంగా పెట్రోలింగ్ చేయాలన్నారు. ఏ సమస్య వచ్చినా తమదృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిగి, (ఆంధ్రజ్యోతి): ఎస్పీగా సతీష్‌కుమార్ బుధవారం పరిగి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, గ్యాంబ్లింగ్, మిస్సింగ్ తదితర కేసులపై దృష్టిసారించి నేరస్థులను గుర్తించి అరెస్ట్ చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ రాఘవన్, ఏఎస్ఐ బాలరాజు, వెంకటేశ్వర్లు, జమేదార్ సునీల్‌నాయక్, కానిస్టేబుల్ సురేష్, రామాంజి, శివ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

ఓటరు లిస్ట్ తయారీలో జాగ్రత్త వహించండి

జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న జేసీ

హిందూపురం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఓటరులిస్ట్ తయారీలో జాగ్రత్తలు వహించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకులు ప్రతి పోలింగ్ స్టేషన్‌కు బూత్‌లెవెల్ ఏజెంట్లు నియమించుకోవాలన్నారు. అక్టోబరులో ఎన్నికల కమిషన్ ఆదేశాలమేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఉంటుందన్నారు. బూత్ లెవెల్ అధికారులు వారి వారి పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ఓటరు లిస్ట్ సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్, సౌజన్యలక్ష్మీ, మునిసిపల్ కమిషనర్ మల్లికార్జున, డీటీ మైనుద్దీన్, టీడీపీ పట్టణాధ్యక్షుడు వెంకటేశ్, బీజేపీ రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు తీరిన రైతులు



సింగిల్‌విండో కార్యాలయం వద్ద బారులు తీరిన రైతులు

సోమందేపల్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సింగిల్ విండో కార్యాలయానికి యూరియా లోడ్ రావడంతో బుధవారం రైతులు గోదామువద్ద బారులుతీరారు. వర్షాలు బాగా పడుతుండటంతో అధిక శాతం రైతులు వరి వేసుకోవడానికి సుముఖత చూపడంతో యూరియాకు డిమాండ్ పెరిగింది. సీఈఓ జయరాం మాట్లాడుతూ ప్రస్తుతం 280బస్తాల యూరియా గోదాముకు చేరిందని అన్నారు. ఒక్కో రైతుకు రెండు బస్తాలు చొప్పున అందజేస్తామన్నారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

అమరాపురం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దక్షిణ గొల్లహట్టి ప్రాథమిక వ్యవసాయ సహకార కార్యాలయం పక్కన బుధవారం ఆధార్ సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా తహసీల్దార్ లక్ష్మీనరసింహం, మండల కన్వీనర్ కృష్ణమూర్తి, సింగిల్‌విండో అధ్యక్షుడు గణేష్ హాజరయ్యారు. ఆధార్ సేవా కేంద్రం స్థానికంగా లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని ప్రజల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని స్థానికంగా ఏర్పాటుచేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ దాదాపీర్, మండల కార్యదర్శి నాగరాజు, మాజీ జడ్పీటీసీ నర్సింహమూర్తి, మారుతి ప్రసాద్, శివరుద్రప్ప, తిప్పేస్వామి, వాల్మీకి మంజునాథ్, నాగరాజు, చెన్నప్ప, రఘు, తమ్మడేపల్లి నాగరాజు, శకునప్ప, చంద్రశేఖర్‌గౌడ్, ఆధార్ సేవాకేంద్రం నిర్వాహకులు నిరంజన్ పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి: సీడీపీఓ



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శిశు సంక్షేమశాఖ అధికారులు

పావగడ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మహిళలు పోషకాహారాన్ని తీసుకోవాలని సీడీపీఓ సునీత సూచించారు. స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్, శిశు సంక్షేమశాఖ కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం జాతీయ పోషకాహారంపై అవగాహన కార్యక్రమాన్ని తాలూకా పరిధిలోని రాజవంతి కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ముఖ్యంగా గర్భిణులు పోషకాహారాన్ని స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిశుఅభివృద్ధిశాఖ అధికారిని అంబికా, వీఎస్ఎస్ఎన్ అధ్యక్షుడు జయరామిరెడ్డి, పీఎల్‌టీ బ్యాంకు డైరెక్టర్ దాసానాయక్ పాల్గొన్నారు.

నివేదిక ఇవ్వండి

పావగడ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పంచ గ్యారెంటీలపై జూలై, సెప్టెంబరు నెలల్లో జరిగిన అవకతవకలకు సంబంధించి అక్టోబరు 30లోగా నివేదిక అందించాలని అధ్యక్షుడు పాపన్న సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం తలపుల పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ప్రగతి పరిశీలన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈఓ ఉత్తమ్, గ్యారెంటీ మనస్థాన సమితి సభ్యులు దివాకర్, రంగయ్యగౌడ, సుమ, లక్ష్మీ, శంషుద్దీన్, డీపీ మేనేజర్ మజీద్‌ఖాన్ హాజరయ్యారు.

గ్రామీణులకు వరం.. ఆసుపత్రి నిర్మాణం

కొడూరు తోపులో శరవేగంగా సాగుతున్న పనులు



జోరుగా సాగుతున్న మండల-2 ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులు

చిలమత్తూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎంతో కాలంగా మండల కేంద్రానికి దూరంగా ఉన్న గ్రామీణ ప్రజల కల త్వరలో నెరవేరబోతోంది. ఇంత కాలం ప్రభుత్వ వైద్యానికి దూరంగా ఉంటూ ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ప్రభుత్వాసుపత్రి దగ్గరవుతోంది. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ కృషి పేద ప్రజల ఆరోగ్య కష్టాలను తీర్చనుంది. మండలంలో 51 వేల వరకు జనాభా ఉంది. అయితే ఎంతో కాలంగా మండల కేంద్రంలో ఉన్న ఒకే ఒక్క ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సేవలందిస్తోంది. కేవలం ఇద్దరు డాక్టర్లతో ఆసుపత్రిలో ప్రజలకు సేవలందేవి. కానీ ఎమ్మెల్యే బాలకృష్ణ పేద ప్రజల కష్టాలను తెలుసుకొని మండలానికి మరో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తీసుకువచ్చారు. అందులో భాగంగా కోడూరు తోపులో రూ. 1.2 కోట్లతో ఆసుపత్రి నిర్మాణం జరుగుతోంది.

దూరపు పల్లెలకు అందని వైద్యం

మండల కేంద్రానికి గ్రామాలు పది నుంచి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ప్రధానంగా చాగలేరు, సోమఘట్ట, పలగలపల్లి మొరసలపల్లి, శెట్టిపల్లి పంచాయతీలలోని 25 గ్రామాలతో పాటు కోడూరు పంచాయతీలోని సుబ్బరావుపేట, కోడూరు, మధురేపల్లి, కొడికొండ పంచాయతీ తదితర గ్రామాలు మండల కేంద్రానికి దూరంగా ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందేది కాదు. ఆ గ్రామాల ప్రజలు ఆసుపత్రికి రావాలన్నా రవాణా సౌకర్యాలు ఉండేవి కావు. దీంతో డబ్బులు వెచ్చించుకొని గోరంట్ల, బాగేపల్లి పట్టణాల్లోని ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకునేవారు. గర్భవతులు, బాలింతల కష్టాలు మరింత దారుణంగా ఉండేవి. ఆరోగ్య సిబ్బంది గ్రామాలకు వెళ్లినా అరకొరగానే సేవలు అందేవి. ఈ తరుణంలో చిలమత్తూరులో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్యం కోసం రావాలంటే నానా ఇబ్బందులు పడాల్సి వచ్చేది.

శరవేగంగా సాగుతున్న పనులు

మండలంలో పెరిగిన జనాభాతోపాటు మండల కేంద్రానికి దూరంగా ఉన్న పల్లె ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న భావనతో ప్రభుత్వం కోడూరు తోపులో రెండవ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేసింది. ఇప్పటికే తాత్కాలిక పంచాయతీ భవనాల్లో ఇద్దరు డాక్టర్లతోపాటు సిబ్బందిని కెటాయించి వైద్య సేవలు ప్రారంభించారు. వైద్యం కోసం చిలమత్తూరుకి వెళ్లలేని ప్రజలు కోడూరు తోపులో ఏర్పాటైన ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నారు. ఈ తరుణంలో శాశ్వత భవనాలతో ఆసుపత్రిని పూర్తీస్థాయిలో ఏర్పాటుచేయడానికి ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవ చూపుతున్నారు. అధికారులు ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నారు. ఈ ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే మండల కేంద్రానికి దూరపు పల్లెలుగా ఉన్న సోమఘట్ట, పలగలపల్లి, చాగలేరు, కొడికొండ, శెట్టిపల్లి పంచాయతీలోని అన్ని గ్రామాల ప్రజలకు, కోడూరు పంచాయతీలోని మొరంపల్లి, మధురేపల్లి, సుబ్బరావుపేట, కంబాలపల్లి గ్రామాల ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందుబాటులోకి వస్తుంది.

అత్యవసర వైద్యానికి ఎంతోమేలు

కోడూరు తోపులో నిర్మాణమవుతున్న ఆసుపత్రి అత్యవసర వైద్య సేవలకు ఎంతో ఉపయోగపడనుంది. కోడూరు తోపు బెంగళూరు-హైదరాబాదు 44వ జాతీయ రహదారి, కోడూరు-పుట్టపర్తి 342 జాతీయ రహదారి ఉండటంతో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో ప్రమాద బాధితులకు అత్యవసర చికిత్సలు అందివ్వడానికి ఇక్కడ నిర్మాణం అవుతున్న ఆసుపత్రి సంజీవిలా మారుతుందనడంలో సందేహం లేదు. రోడ్డు ప్రమాదాలు జరిగిన వెంటనే బాగేపల్లి, హిందూపురం తరలించాల్సి వస్తోంది. అయితే జాతీయ రహదారుల పక్కనే ఈ ఆసుపత్రి నిర్మాణం కావడం సంతోషించదగ్గ విషయం.

గ్రామీణులకు అందుబాటులోకి వైద్యం



ఎంతో కాలంగా మండలంలో రెండవ ప్రభుత్వాసుపత్రిని తీసుకురావాలని ప్రజలు కోరుతూ వచ్చారు. అయితే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే బాలకృష్ణ సత్వర చర్యలు చేపట్టారు. నిధులు మంజూరు చేయించి ఆసుపత్రి నిర్మాణాన్ని ప్రారంభించారు. పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే గ్రామీణులకు వైద్యం ఎంతో అనుకూలంగా ఉంటుంది.

- ఎగువింటి శ్రీనివాసులు,
మండల టీడీపీ కన్వీనర్, చిలమత్తూరు

సంతోషంగా ఉంది



ఎట్టకేలకు ఎమ్మెల్యే బాలకృష్ణ పేద ప్రజల కష్టాలను తెలుసుకొని వెంటనే కోడూరు తోపులో ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. కోడూరు తోపులో ఆసుపత్రి నిర్మాణం కావడం సంతోషంగా ఉంది. ఇక్కడ ఏర్పాటైతే దాదాపు 40 గ్రా మాల ప్రజలకు వైద్యం అందుబాటులోకి వస్తుంది. ఇకనుంచి దూరపు గ్రామాల ప్రజలు చిలమత్తూరు వెళ్లాల్సిన అవసరం ఉండదు. నేరుగా కోడూరు తోపునకు వస్తే చాలు. రవాణా మార్గాలు కూడా చాలా అనుకూలంగా ఉన్నాయి.

- మురళీమోహన్, కోడూరు సర్పంచ్

భార్య హత్యకేసులో భర్త అరెస్ట్

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): భార్య హత్యకేసులో భర్త అల్తాఫ్‌ఖాన్‌ను అరెస్ట్‌చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ రాఘవన్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలను వెల్లడించారు. 2018లో పట్టణంలోని న్యూ రెవెన్యూ కాలనీలో నివాసముంటున్న అల్తాఫ్‌ఖాన్, సుమియాబాను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అయితే 2023 నుంచి భార్యపై అనుమానంతో వేధింపులు కొనసాగించాడు. అప్పట్లో మృతురాలు సుమియాబాను ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. తాగుడుకు బానిసై భార్యతో ఘర్షణ పడేవాడని ఈక్రమంలో మృతురాలు పుట్టింటికి వెళ్లింది. గత ఆగస్టు 26న నమ్మించి ఇంటికి తీసుకెళ్లి తనపై ఉన్న కేసులు రాజీచేసుకోవాలని బతిమాలాడు. ఈ క్రమంలో మాటామాటా పెరిగి రాడ్‌తో తలపై బాదాడు. అపస్మారక స్థితిలో ఉన్న భార్యను ఆటోలో పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనంతరం హిందూపురానికి తరలించాడు. మెట్లపై నుంచి కిందపడిందని చికిత్సచేయించాడు. విషయం తెలుసుకున్న బంధువులు మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. ఈనెల 12న చికిత్స పొందుతూ సుమియాబాను(25) మృతిచెందింది. అప్పటి నుంచి పరారీఅయిన అల్తాఫ్‌ఖాన్‌ను అరెస్ట్‌చేశామని సీఐ తెలిపారు. కేసు నమోదుచేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితులు...

గోరంట్ల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులేరు గ్రామ సమీపంలో జరిగిన హత్యకేసుకు సంబంధించి మధ్యప్రదేశ్‌కు చెందిన లాల్‌కుమార్, హీరాలాల్‌ను బుధవారం అరెస్టు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. మద్యం మత్తులో ఘర్షణపడి లాల్‌కుమార్, హీరాలాల్ ఇరువురు భునేశ్వర్‌పై దాడిచేసి గాయపరిచగా చికిత్స పొందుతూ అతడు మృతిచెందాడు. ఈ నేపథ్యంలో లాల్‌కుమార్, హీరాలాల్‌ను బుధవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

అన్నపూర్ణగా అమ్మవారు



పరిగిలో కాత్యాయనిగా దర్శనమిస్తున్న హొన్నదేవి ఆలయంలో వెలసిన సప్తమాతృక అమ్మవారు



పెనుకొండలో వారాహిగా అమ్మవారి దర్శనం



అన్నపూర్ణదేవి అలంకరణలో కొలువుదీరిన వడిసలమ్మ

శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మూడోరోజు బుధవారం పట్టణంలోని అమ్మవారి ఆలయాల్లో దేవతామూర్తులు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అలంకరణ చేశారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.

జీఎస్టీ తగ్గింపుపై క్షీరాభిషేకం

పరిగి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గించినందుకు ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు బీజేపీ నాయకుడు పరిగి వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో పట్టణంలోని సచివాలయం వద్ద బుధవారం క్షీరాభిషేకం చేశారు. నిత్యావసర సరుకులు, వాహనాలు, పాఠ్యపుస్తకాలు తదితదిరవాటిపై జీఎస్టీ తగ్గించడంతో ఎంతో మంది పేద ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మూర్తి, బద్రీ, తదితరులు పాల్గొన్నారు.

ఎలుగుబంటి దాడిలో రైతుకు గాయాలు

పావగడ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నాగలాపురం గేటు వద్ద ఉన్న పొలంలో కాపలావుండగా ఎలుగుబంటి రైతు వెంకటేశ్‌పై దాడిచేసింది. దీంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. కేకలు వేయడంతో ఎలుగుబంటి పారిపోయింది. అటవీశాఖ అధికారి బసవరాజ్ అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గాయపడిన వెంకటేశ్‌ను తుమకూరు ఆస్పత్రికి తరలించారు.

విజయవంతం చేయండి: ఎంపీడీఓ

గుడిబండ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేట్టిన పీ4 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కేశవరెడ్డి పేర్కొన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4 కార్యక్రమాన్ని గ్రామాల్లో పకడ్బందీగా నిర్వహించాలని ఆయన సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రకాశ్, చక్రవర్తి, అమరేష్, దివాకర్, హరీష్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

హిందూపురం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 9వ వార్డులోని శ్రీకంఠపురం, బసవేశ్వరకాలనీ, పులమతిరోడ్డులో గత కొన్నేళ్లుగా విద్యుత్ సమస్య ఉంది. అయితే ఈ విషయాన్ని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, పీఏ వీరయ్య దృష్టికి తీసుకెళ్లడంతో ట్రాన్స్‌కో అధికారిని మాట్లాడి 25కేవి కెపాసిటిగల కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్మన్ రమేష్ తెలిపారు. ఇక మీదట ఈ ప్రాంతంలో విద్యుత్ సమస్య ఉండదన్నారు.

గ్రామాల అభివృద్ధి ప్రధాన లక్ష్యం

ఎమ్మెల్యే పీఏ వీరయ్య



గ్రామంలో పర్యటిస్తున్న వీరయ్య, నాయకులు

చిలమత్తూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి లక్ష్యమని ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ వీరయ్య పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మొరసనపల్లి పంచాయతీలో ఆయన మండల టీడీపీ కన్వీనర్ శ్రీనివాసులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి గ్రామాల్లో తిరుగుతూ ప్రజల నుంచి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. అత్యవసర సమస్యలను పరిష్కరించడానికి అధికారులతో అక్కడికక్కడే చర్చించారు. కార్యక్రమంలో ఆయన వెంట స్థానిక నాయకులు బయపరెడ్డి, వేమనారాయణ, మండల మహిళా కార్యదర్శి విజయలక్ష్మి, మంజు పాల్గొన్నారు.

భూముల పరిశీలన

అగళి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో వచ్చేనెల 15వ తేదీ నాటికి 33 స్మశానవాటికలకు సంబంధించి భూములను చూపాలని రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు ఆదేశించినట్లు జడ్పీటీసీ ఉమేష్, మండల కన్వీనర్ మధుడి తిప్పేస్వామి తెలిపారు. ఏ గ్రామంలో ఏయే కులాలకు స్మశానవాటికలు లేవో వారికి తప్పనిసరిగా ప్రభుత్వ భూములు కేటాయించాలని సూచించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగానే రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు గ్రామాల్లో పర్యటించి భూములను పరిశీలిస్తున్నారన్నారు.

జలహారతికి రండి

సీఎంను కోరిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



చంద్రబాబునాయుడుతో మాట్లాడుతున్న ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని చెరువులకు హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణాజలాలు విడుదల అయ్యాయని, అమరాపురం చెరువుకు నీరు రాగానే జలహారతికి రావాలని సీఎం చంద్రబాబునాయుడు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కోరారు. సీఎంను బుధవారం ఆయన కలిశారు. ఈ సందర్భంగా గతంలో ఇచ్చిన హామీల అమలుతీరును సీఎంకు వివరించారు.

ఆసుపత్రి అభివృద్ధికి కృషిచేస్తా

బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్



మాట్లాడుతున్న జీఎం శేఖర్

గోరంట్ల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తానని బీజేపీ జిల్లా అధ్యక్షుడు, రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ జీఎం శేఖర్ తెలిపారు. బుధవారం గోరంట్లలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కన్వీనర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. 80 మంది రక్తదానం చేశారు. అన్ని దానాల కంటే రక్తదానం గొప్పదని ఈ సందర్భంగా జీఎం శేఖర్ అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి అష్ఫక్, వినోద్‌కుమార్, వైద్యాధికారులు, నాయకులు బాలక్రిష్ణచౌదరి, లక్ష్మీనారాయణ, నిమ్మల విద్యాధరణి, నిమ్మల శ్రీధర్, మేదర శ్రీనివాసులు, సురేష్, అనిల్, గంగాధర్, చలం, ఆజంతుల్లా, శంకర్‌రెడ్డి, ముంతాజమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న గుండుమల తిప్పేస్వామి

అగళి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మరసనపల్లి గేటు వద్ద వెంకటేశ్వర కల్యాణమండప సమీపంలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి బుధవారం భూమిపూజ చేశారు. విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి చిక్కప్ప, కుటుంబీకులు నిర్మిస్తున్న ఆలయ నిర్మాణానికి భూమిపూజచేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఉమేష్, సర్పంచ్ సన్నమ్మ, రంగయ్య, కన్వీనర్ మధుడి తిప్పేస్వామి, సింగిల్‌విండో అధ్యక్షుడు కుమారస్వామి, నాయకులు రామక్రిష్ణ, అశ్వర్థప్ప, జయరామప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకోండి

హౌసింగ్ సీఎల్‌సీటీ రఘునాథ్

పెనుకొండ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పట్టాలున్న లబ్ధిదారులు గృహాల నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ సీఎల్‌సీటీ రఘునాథ్ సూచించారు. బుధవారం గృహనిర్మాణశాఖ ఆధ్వర్యంలో స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన, అర్బన్ 2.0 అంగీకార్ 2025పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ 1500 మందిదాకా లబ్ధిదారులు స్థలం కలిగి ఉన్నారని, గృహాల మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఈ శివకుమార్, ఏఈ శ్రీనాథ్, రొద్దం ఏఈ ఖాజామొయినుద్దీన్, ఈఏ యోగీశ్వరయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ శశి, టీడీపీ పట్టణ కన్వీనర్ శ్రీరాములు, మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వివరాలను అప్‌లోడ్ చేయండి: ఎంపీడీఓ

సోమందేపల్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పీ-4 పథకం కింద ఎంపికైన లబ్ధిదారుల వివరాలను జాగ్రత్తగా అప్‌లోడ్ చేయాలని ఎంపీడీఓ నర్సింగరావు సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో ఆయన సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. తుదిజాబితాకు సంబంధించి లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి అర్హత పత్రాలను పునఃపరిశీలించాలన్నారు. అర్హులాకాదా అని తెలుసుకుని ఆపై వాటి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

'మహిళలు సద్వినియోగం చేసుకోవాలి'

సోమందేపల్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్వస్తనారీ స్వశక్త్ పరివార్ అభియాన్ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ నరసింహులు అన్నారు. బుధవారం మండలంలోని మాగేచెరువు గ్రామంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రసంగించారు. ఈ పథకం ద్వారా అన్నిరకాల పరీక్షలు ఉచితంగా నిర్వహించి వైద్య చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఓంకార్, తాగునీటి సంఘం అధ్యక్షులు తిమ్మయ్య, సింగిల్‌విండో అధ్యక్షులు పూలవెంకటేశులు, మాజీ ఎంపీటీసీ రామాంజినేయులు, భాస్కర్, కొల్లప్ప పాల్గొన్నారు.

ఆసుపత్రి ఆవరణలో ముళ్లపొదల తొలగింపు

గోరంట్ల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణం వెనుక ఏపుగా పెరిగిన ముళ్లపొదలు, పిచ్చిమొక్కలను టీడీపీ నాయకులు బుధవారం ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణంలోని పరిస్థితిని మెడిల్ అధికారి టీడీపీ నాయకులు కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి, నిమ్మల శ్రీధర్ దృష్టికి తెచ్చారు. నిమ్మల శ్రీధర్ స్పందించి సొంత నిధులతో చెత్తాచెదారం తొలగించారు. కార్యక్రమంలో డాక్టర్ వినోద్‌కుమార్, నాయకులు బాలక్రిష్ణచౌదరి, ఉత్తమరెడ్డి, రవినాయక్, అజంతుల్లా, కలీమ్, మహేంద్ర, హరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ చేయండి

పెనుకొండ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని బహుజన చైతన్యవేదిక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది శివరామక్రిష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో దశాబ్దాలకాలంగా ఆర్డీటి సేవలందిస్తూ అభివృద్ధికి పాటుపడుతోందన్నారు. ఈ నేపథ్యంలో ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ చేయాలన్నారు.

నీటి సమస్యను పరిష్కరించండి

ఎంపీడీఓకు ప్రశాంతినగర్‌వాసుల వినతి

పరిగి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నెలరోజుల నుంచి మండలకేంద్రంలోని ప్రశాంత్‌నగర్‌లో నీటి సమస్య ఉందని కాలనీవాసులు ఎంపీడీఓ రెడ్డప్పకు బుధవారం ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులకు విన్నవించినా తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారుతప్ప శాశ్వత పరిష్కారం చూపడంలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ అధికారిని విచారించి సమస్య పరిష్కరిస్తామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు.